# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక : 11 విజయవాడ 5-10-2012 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- 'పెట్టుబడిదారీ విధానంలో పర్యావరణ కాలుష్య సమస్య పరిష్కారంకాదు' –చౌ ఎన్ లై
- యురేనియం తవ్వకాలు–శుద్ధి ప్రక్రియలను విస్తరిస్తున్న పాలకులు
- ఒరిస్సా : చట్టబద్ధ పాలనను బడాబూర్జువాలకప్పజెప్పిన ప్రభుత్వం
- యు.పి : అఖిలేష్‌యాదవ్ ప్రభుత్వపు 'దళిత వ్యతిరేక' అడుగులు
- ఔషధ ప్రయోగాలు : భారత ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- జెఏసి ఆందోళనలు, పోరాటాలు ఆర్థిక డిమాండ్ల వరకే పరిమితం చేయరాదు


# దేశ ప్రయోజనాలకూ, ప్రజాసంక్షేమానికి తూట్లు పొడిచే బొగ్గుగనుల ప్రైవేటీకరణను ప్రతిఘటించండి!

**యుపిఏ** ప్రభుత్వం బడా బూర్జువా వర్గానికి బొగ్గుగనులు కేటాయించినందున ప్రభుత్వ ఖజానాకు రావలసిన ఆదాయంలో లక్షా 86వేల కోట్లరూపాయలకు గండి పడిందని కంప్‌ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. అడిగిన వారికి అడిగినట్లుగా కేటాయించకుండా, బహిరంగవేలం ద్వారా కేటాయించివుంటే గండిపడకుండా ఆదాయం వచ్చివుండేదని కాగ్ వాదన. దీనితో ప్రతిపక్షాలకు ఒక ఆయుధం దొరికింది. బొగ్గుకుంభకోణానికి బాధ్యత వహించి ప్రధానమంత్రి రాజీనామా చేయాలని కోరుతూ పార్లమెంటును స్థంభింపజేశాయి. యుపిఏ ప్రభుత్వం తన విధానాన్ని సమర్థించుకుంటూ మొదట కాగ్‌పై విరుచుకు పడింది. కాగ్ ఇచ్చిన గణాంకాలు ఆధారపడతగినవి కాదనీ, కేటాయింపులు పొందిన వారు బొగ్గు తవ్వకాలు చేపట్టలేదు గనుక నష్టం ఊహాజనితమని వాదించింది. ఆ తర్వాత బొగ్గును వినియోగించుకునే పరిశ్రమలకే కేటాయించినందున అవి ఉత్పత్తి చేసిన సరుకులు (ప్రధానంగా విద్యుత్తు, ఉక్కు, సిమెంటు) తక్కువ ధరకే ప్రజలకు అందుతాయి గనుక తమ విధానం సరైనదేనని సమర్థించుకుంది. కాగా, బహిరంగ వేలం వేయకుండా కొందరికి లబ్ధి చేకూర్చిందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. చివరకు 2జి స్పెక్ట్రం కేటాయింపులపై రాష్ట్రపతి వివరణ కోరుతూ పంపిన అంశాలపై సుప్రింకోర్టు రాజ్యాంగ ధర్మాసనం, దేశ సహజవనరుల కేటాయింపుకు బహిరంగ వేలం ఒక్కటే పద్ధతి కాదనీ, ప్రజా సంక్షేమ దృష్టితో కేటాయింపు విధానాన్ని నిర్ణయించుకునే అధికారం ప్రభుత్వానికుందని స్పష్టం చేసింది. దీనితో బొగ్గు రగడ కొంత మేరకు సద్దుమణిగింది.

## జరిగినకథ

1972-73లో ప్రభుత్వం బొగ్గు గనులను జాతీయం చేసింది. సహజవనరులు పరిమితమైనవి గనుక వాటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవటమవసరమని వాదించి బొగ్గుగనుల (జాతీయీకరణ) చట్టాన్ని చేసింది. ప్రైవేటు బొగ్గుగనులను జాతీయం చేసి కోల్ ఇండియా లిమిటెడ్ అన్న ప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యంలోకి తెచ్చింది. నూతన ఆర్థిక విధానాలు చేపట్టిన తర్వాత సర్వరోగ నివారిణిగా ప్రైవేటీకరణ మంత్రజపాన్ని పాలకులు సాగిస్తున్నారు పెట్రోలియం సహజవాయువు వనరులను నూతన అణ్వేషణ వెలికితీత విధానంతో ప్రైవేటీకరణ చేశారు. ఇనుపగనులనూ ప్రైవేటీకరించారు. భూమినీ, నీటినీ కూడా ప్రైవేటుపరం చేస్తున్నారు. ఇక్కడ ప్రైవేటీకరణ అంటే విదేశీ పెట్టుబడిదారులకూ, వారితో మిలాఖత్తు అయిన భారతబడాబూర్జువా వర్గానికీ ధారాదత్తం చేయటమేనని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు "ఇతర మౌలిక రంగాల్లో వలనే, బొగ్గు గనుల రంగంలో కూడా, మదుపుదారులకు రక్షిత వాతావరణంతో అశావహ అవకాశాలున్నాయని విదేశీ పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కలిగించాము" అని గనుల మంత్రి జైస్వాల్ చేసిన ప్రకటనే (2012 ఆగస్టు) దీనిని తెలుపుతున్నది.

ఈ ప్రైవేటీకరణ విధానంలో భాగంగానే గత ప్రభుత్వాలు (యుపిఏ, ఎన్‌డిఏ కూటములు రెండూ) బొగ్గుగనుల ప్రైవేటీకరణకు పూనుకున్నాయి, బొగ్గుగనుల జాతీయీకరణ సవరణ బిల్లును ఎన్‌డిఏ ప్రభుత్వం 2000లో పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ప్రవేశ పెట్టిన ఎన్‌డిఏ ప్రభుత్వమూ, తర్వాత అధికారంలోకి వచ్చిన యుపిఏ ప్రభుత్వమూ ఎన్ని ప్రయత్నాలు చేసినా పార్లమెంటులో చట్టంగా చేయలేకపోయాయి. బొగ్గుగని కార్మికుల, ట్రేడ్ యూనియన్ల నుండి వచ్చిన వ్యతిరేకత దీనికి ఒక కారణం. ప్రజల, కార్మికుల కన్నుగెప్పే మరో విధానం కనుక్కోవటం మరో కారణం. ఇది మరింత ఫలప్రదమైనదిగా పాలుకులెంచుకున్నారు.

అదే "అనుబంధిత గనుల" పద్ధతి. బొగ్గును వినియోగించుకునే పరిశ్రమలకు వాటి స్వంత వినియోగం కోసం బొగ్గుగనులను కేటాయించటం (వాటినే కాప్టివ్ మైన్స్ అంటారు) అనే పద్ధతిని ముందుకు తెచ్చారు. 1976లో బొగ్గుగనుల చట్టానికి సవరణ తెచ్చి ఇనుము, ఉక్కుగనులకు అనుబంధిత గనులు అనుమతించారు. 1993లో మరో సవరణతో విద్యుదుత్పత్తి, సిమెంటు పరిశ్రమలకుకూడా వర్తింపచేశారు. బొగ్గుగనుల జాతీయీకరణ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వం అనుబంధితగనుల కేటాయింపుకు స్క్రీనింగ్ కమిటీని నియమించింది. వినియోగ పరిశ్రమలకు మాత్రమే బొగ్గు గనులను కేటాయించాలన్న నిబంధనను 2006లో ప్రభుత్వం సడలించింది. బొగ్గు వినియోగించుకునే పరిశ్రమతో బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకున్న గనుల కంపెనీకి కూడా బొగ్గు గనులు కేటాయించవచ్చునని నిర్ణయించింది. దీని ప్రకారం స్క్రీనింగ్ కమిటీ బొగ్గుగనులు కేటాయించింది.

116 బొగ్గు గనుల బ్లాకులను తనకు కేటాయించమని కోల్ ఇండియా కోరగా ఇంతవరకూ స్క్రీనింగ్ కమిటీ వాటికి అనుమతి మంజూరు చెయ్యలేదు. అదే సమయంలో కొత్త విద్యుత్తు కంపెనీలతో బొగ్గు సరఫరా ఒప్పందాలు చేసుకొమ్మని ప్రధానమంత్రి కార్యాలయం కోల్ ఇండియాను ఆదేశించింది తనకంత ఉత్పత్తి లేనందున ఒప్పందాలు చేసుకోలేనని కోల్ ఇండియా చెప్పింది. తన ప్రైవేటీకరణ విధానాన్ని సమర్థించుకునేందుకు కోల్ ఇండియాకు సరఫరా శక్తి లేనందున బొగ్గుగనుల ప్రైవేటీకరణే శరణ్యమనేందుకే తతంగం సాగించారు.

## ప్రైవేటీకరణ "ఫలాలు"

శక్తివంతమైందంటున్న ప్రైవేటు రంగం సాధించిందేమిటి? స్క్రీనింగ్ కమిటీ 90 బొగ్గుగనులను ప్రైవేటు కంపెనీలకు కేటాయించింది. వీటికి కేటాయించిన మొత్తం బొగ్గు నిల్వలు 4400 కోట్ల మెట్రిక్ టన్నులు. ఇది ప్రపంచవార్షిక ఉత్పత్తికి ఆరురెట్లు ఎక్కువ. కేటాయింపులు పొందినవారు రిలయన్సు, టాటా, హిండాల్కొ (బిర్లా), వేదాంత, ఎస్సార్ మొదలగు బడాబూర్జువాలు. వీటిలో 8 గనులలో మాత్రమే బొగ్గు తవ్వకాలు మొదలయ్యాయి. ఇవన్నీ కలిపి 7.3 కోట్ల టన్నుల బొగ్గును తవ్వితీస్తాయని చెప్పారు. ప్రైవేటు కంపెనీలు తవ్వితీసింది కోటి టన్నులు కూడా లేదు.

కాగ్‌నివేదిక తయారవుతుండగా ప్రభుత్వం హఠాత్తుగా 68 కంపెనీలు అసలు పనులే మొదలు పెట్టలేదని తెలుసుకొంది. వాటిలో 58 కంపెనీలకు నోటీసులిచ్చింది. ఇటీవల వీటిలో కొన్ని కంపెనీలకిచ్చిన లైసెన్సులురద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ పరిస్థితి ఎందుకేర్పడింది? ప్రభుత్వం చెప్పిన కారణాలివి. మొదటికారణం : ఈ గనులన్నీ లోతట్టు ప్రాంతాల్లో ఉన్నందున రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు లేవు. ఈ మౌలిక సదుపాయాలు నిర్మించి (తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

# స్టాలిన్‌గ్రాడ్‌లో మహత్తర విజయం

**రెండవ** ప్రపంచ యుద్ధంలోకెల్లా అతిపెద్ద సమరం 60ఏళ్ల క్రితం జరిగింది. బ్రిటీషు సామ్రాజ్యవాదులు చిత్రించిన పుక్కిటి పురాణంలోలా అది ఆఫ్రికా ఖండపు సహారా ఇసుక ఎడారుల్లో సాగలేదు. అమెరికా సామ్రాజ్యవాదుల వక్రచరిత్రలోలా అది పసిఫిక్ మహాసముద్రంలో సాగలేదు. అది వోల్గానది ఒడ్డున శిధిల నగరంలో సాగింది. అదే స్టాలిన్‌గ్రాడ్. సోవియటు ప్రజలు, ఎర్రసైన్యమూ సాధించిన ఈ విజయం వ్యూహాత్మక ప్రాధాన్యతగలది. రెండవ ప్రపంచయుద్ధ గతిని మార్చివేసింది. నాజీ జర్మనీ ఓటమిని ఖాయపరిచింది.

రెండవ ప్రపంచయుద్ధంలో బ్రిటన్ అమెరికాలకు చెందిన మొత్తంగా మృతిచెందిన సైనికులకంటే ఎక్కువమంది సోవియటు పౌరులు స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలో నేలకొరిగారు. నాజీ జర్మనీ పొందిన సైనిక నష్టాలలో 90శాతం తూర్పురంగంలోనే, అంటే సోవియటుపై యుద్ధంలోనే పొందింది. దాదాపు కోటిమంది నిహతులో, క్షతగాత్రులో అయ్యారు. అప్పటి బ్రిటీషు ప్రధాని చర్చిల్ మాటల్లోనే జర్మను యుద్ధ యంత్రాంగపు స్థైర్యాన్ని ఎర్రసైన్యం బదాబదలు చేసింది.

స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలో సోవియటు విజయం ఎలా సాధ్యపడింది? మార్షల్ ఝుకోవ్ మాటల్లో చెప్పాలంటే "1942లో యుద్ధ ప్రణాళికలు రూపొందించటంలో నాజీ జర్మనీ–సోవియటు రాజ్యశక్తినీ, సోవియటు ప్రజల మొక్కవోని స్థైర్యాన్నీ తక్కువగా అంచనావేసింది; తన సైనిక సామర్థ్యాన్ని అతిగా అంచనావేసుకుంది"..... "పార్టీ సాగించిన రాజకీయ ప్రచారం–సైనిక సమితులు, దళాధిపతులు, సైనికులలో న్యాయపోరాట ధృతినీ, విశ్వాసాన్ని స్థైర్యాన్ని నెలకొల్పింది. ఇదే విజయానికి బాటవేసింది".

తన యుద్ధ జ్ఞాపకాల గ్రంథాన్ని ముగిస్తూ, దీనినే మరోసారి నొక్కి చెప్పేందుకు లెనిన్ మాటలను ఝుకోవ్ ఉల్లేఖించాడు:

"తమ స్వంత సోవియటు అధికారమూ, శ్రమజీవుల పాలన పరిరక్షణకొరకూ, మానవశ్రమ సృష్టించిన సమస్త సంస్కృతి ఫలాలను తమకూ తమ పిల్లలకు అందజేసే విజయం కొరకు పోరాడుతున్నామని అత్యధిక మెజారిటీ కార్మికులూ, కర్షకులు గుర్తించినప్పుడు, అలా విశ్వసించినప్పుడు ఆదేశం ఏనాటికీ ఓటమి చెందదు"(లెనిన్, సంకలిత రచనలు, సంపుటి 29, పే.319).

ఆ విశ్వాసాన్ని సోవియటు ప్రజలలో స్టాలిన్ పాదుకొల్పగల్గాడు. సోషలిస్టు సమాజ నిర్మాణంకోసం ఆయన సారథ్యంలో సోవియటు పార్టీ సాగించిన సిద్ధాంత, రాజకీయ, నిర్మాణకృషివల్ల అది సాధ్యపడింది. స్టాలిన్‌గ్రాడ్ విజయ రహస్యమిదే.

ఈ ప్రజాచైతన్య పాత్రను కప్పిపుచ్చి మసిపూసి మారేడుకాయ చేసేందుకు సామ్రాజ్యవాదం పూనుకుంది. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో ఈ పని సాగించింది. తన పేరు పెట్టిన నగరం చేజారిపోవటం తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగమని భావించిన స్టాలిన్ శిక్షణ కూడా లేని నవయువకులను స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలోకి బలవంతంగా పంపాడనీ, గుట్కావంటి మత్తుపదార్థాలు నములుతూ వారా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారనీ, తన వ్యక్తిగత ప్రతిష్టకోసం లక్షలాది యువకుల ప్రాణాలు బలిపెట్టాడనీ ఆంటోనీ బీవరు అన్న యురోపియన్ చరిత్రకారుడు నిందారోపణలు చేశాడు. యుద్ధాలను వ్యక్తుల సమస్యగా, వ్యక్తిత్వాల సమస్యగా చిత్రించి, దానిలో వున్న దోపిడీ వర్గాల పాత్రను దాచిపెట్టడం బూర్జువా చరిత్ర లక్షణమే.

స్టాలిన్‌గ్రాడ్‌ను పట్టుకోవటమే నాజీసైన్యం లక్ష్యం కాదు. వోల్గానదిని దాటి, కాకసస్ పర్వతాల ఆవలనున్న బాకు ప్రాంత చమురు వనరులను ఆక్రమించటం దాని లక్ష్యం. రష్యా చమురు అవసరాలలో 80శాతం ఇక్కడినుండే తీరుతుండేవి. బాకును ఆక్రమిస్తే సోవియటుకు చమురు అందకుండా చేయటంతోపాటు, తనకులేని చమురుపై ఆధీనం పొందుతుంది. బాకు నాక్రమించేందుకు వెళ్లే నాజీ సైనిక దళాలకు సరఫరాలు సాగాలంటే ఓల్గా, డాన్ నదీతీరం దాని ఆధీనంలో వుండాలి. ఆవిధంగా స్టాలిన్‌గ్రాడ్‌ను ఆధీనంలో వుంచుకోవాల్సివచ్చింది. 1942 అక్టోబరు నాటికి 90శాతం స్టాలిన్‌గ్రాడ్‌ను నాజీసైన్యాలు ఆక్రమించాయి.

నాజీ జర్మనీపై ప్రతిదాడి సల్పేందుకు స్టాలిన్‌గ్రాడ్‌ను నిలబెట్టుకోవటం సోవియటుకు కీలకమైంది. నాజీలు వోల్గానదిని దాటకుండా సోవియట్ సైన్యం తమ సర్వశక్తులూ ఒడ్డి నిలువరించాయి. ఒకసారి నిలువరించిన తర్వాత నవంబరులో ప్రతిదాడిలో భాగంగా జర్మనీ అవసైన్యంపై యిరువైపులా దాడిచేసి దానిని చుట్టివేశాయి. సోవియట్ సైన్య దిగ్బంధనం చిక్కిన జర్మన్ సైన్యాధిపతి ఫీల్డ్‌మార్షల్ పాలస్ మూడునెలల్లో (1943 ఫిబ్రవరిలో) సోవియటు సైన్యానికి లొంగిపోయాడు. 1943 అక్టోబరు నాటికి నాజీజర్మన్ రష్యా భూభాగంనుండి వెనక్కు నెట్టివేయబడింది.

అందువల్ల నాజీజర్మనీ ఓటమికి దారివేసిన స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం వ్యూహాత్మకంగా కీలకమైనది. అది నాజీజర్మనీపై సోవియటు విజయాన్ని ఖాయపరిచింది. రెండవ ప్రపంచ యుద్ధంలో అత్యంత నిర్ణయాత్మక సమరం స్టాలిన్‌గ్రాడ్ కొరకు సాగిన పోరు అన్నది తిరుగులేని సత్యం.

ఈ కాలంలో సామ్రాజ్యవాదులు చేసిందేమిటి? సోవియటు, జర్మనీలలో ఎవరు ఓటమి చెందుతారో వేచిచూసే విధానాన్ని అనుసరించారు. స్టాలిన్‌కు వాగ్దానం చేసినట్లుగా పశ్చిమాన యుద్ధం వారు ప్రారంభించకుండా వూరుకున్నారు. నాజీజర్మనీని ఎదుర్కొనేభారతమంతా సోవియట్ పైనేవేశారు. ఒకవేళ సోవియటు గెలిచినా, యుద్ధవినాశనంతో కూలిపోతుందని, శ్రామిక రాజ్యమదృశ్యమైపోతుందని పేరాశపడ్డారు. ఝుకోవ్ అన్నట్లే, సోవియటు ప్రజల స్థైర్యాన్ని జర్మనీ తక్కువగా అంచనావేసినట్లే, (తరువాయి 2వ పేజీలో)

# ‘పెట్టుబడిదారీ విధానంలో పర్యావరణ కాలుష్య సమస్య పరిష్కారం కాదు’

## విలియం హింటన్‌తో చౌ ఎన్ లై ముఖాముఖి నుండి

*విలియం హింటన్ అమెరికా రచయిత. 1991 తర్వాత చైనాలో అనేకసార్లు పర్యటించి అక్కడి పరిస్థితి వివరిస్తూ అనేక గ్రంథాలు వ్రాసారు. వాటిలో ప్రసిద్ధిచెందిన రచన ఫాన్‌షేన్(విముక్తి) 1971లో మొదటి పర్యటన సందర్భంగా చైనా ప్రధాని చౌ ఎన్ లైను కలిసి అనేక విషయాలు తెలుసుకున్నారు. వాటిలో ఒక ముఖాముఖిలో కొంతభాగాన్ని ఇక్కడ పునర్ముద్రిస్తున్నాము.*

*ఈ భాగంలో కామ్రేడ్ చౌ ఎన్ లై పర్యావరణ కాలుష్యాన్ని నివారించటానికి తీసుకుంటున్న చర్యలను చర్చించారు. సమిష్టికంటే వ్యష్టికి ప్రాధాన్యతనిచ్చే పెట్టుబడిదారీ సమాజం కాలుష్యనివారణలో విఫలమౌతుందని చెప్పారు. పర్యావరణ సమస్య అంతగా పట్టించుకోని సమయంలో చైనా పర్యావరణ రక్షణ చర్యలు తీసుకొన్న విషయమూ, ఈనాడు గుర్తించి గగ్గోలు పెడుతున్నా పెట్టుబడిదారీ దేశాలు దాని నివారణ చర్యలను కబుర్లతో లొత్సారం చేయటం పెట్టుబడిదారీ పునరుద్ధరణ తర్వాత చైనాలో పర్యావరణ సమస్యలు తీవ్రంకావటమూ గమనించవలసిన అంశాలు.*

**-సంపాదకుడు**

హింటన్ : అంతా ‘సమిష్టేకాని వ్యక్తిగతం ఉండ కూడదు’ అన్నది పిడివాదంగా కన్పిస్తుంది. కనీసం దాన్ని చాలామంది ఆ విధంగానే అర్థంచేసుకుంటున్నారు.

చౌ ఎన్ లై: ‘సమిష్టి’ , ‘వ్యక్తి’ ఈ రెండూ ఒక విషయానికి రెండు వైపులు. వ్యక్తిలేకుండా సమిష్టి ఎలా వుంటుంది? ఇది కూడా “చిన్నది లేకుండా పెద్దదిలేదు” “తక్కువ లేకుండా ఎక్కువ లేదు” లాంటిదే. “అంతా సమిష్టే, వ్యక్తిలేదు” అన్న దానికి అసలు అర్థంలేదు. ఉదాహరణకి– లీఫెంగ్, లీవెన్‌ఝూంగ్, ఓయాంగ్‌హై(ఈ ముగ్గురు కమ్యూనిస్టు యువనాయకులూ చిన్నతనంలోనే చనిపోయారు. చివరి ఇద్దరూ ఇతరులని రక్షిస్తూ మరణించారు) ఈ ముగ్గురూ చనిపోయే క్షణంలో తమ సంగతే మరిచిపోయారు. అయినా వారికి వ్యక్తిగతం అన్నదివుంది. ఆ వ్యక్తిగత స్వార్థమన్నదే లేకపోతే వాళ్లు సమిష్టి భావనని (పబ్లిక్ స్పిరిట్) ఎలా ప్రదర్శించ గలిగేవారు? బూర్జువా సమాజం మా గురించి “మీ కమ్యూనిస్టులు పబ్లిక్ గురించే మాట్లాడుతారు తప్ప వ్యక్తి గురించి చెప్పరు” అని హేళన చేస్తుంది. కానీ ఇది నిజం కాదు. మేము వ్యక్తులు లేకుండా సమూహం ఉండదని అంటాము. ముందు సమిష్టి ఉండాలని మేం చెప్తాం. ప్రతివ్యక్తియొక్క పనీ, సమిష్టిలో లీనమవ్వాలి. ఈ రాత్రి ఇక్కడ మనం వ్యక్తులమేకదా! మనం ఒకదగ్గర చేరాం. కానీ మనిద్దరికి వేరు భావాలూ, పదాలూ వున్నాయి. చివర్లో మనం కొన్ని మౌలికాంశాల గురించి ఏకాభిప్రాయానికి రావచ్చు. ఆ ఉమ్మడి లక్ష్యాలకోసం మనం పోరాడాలి. కాని మనం మన పనుల్లోకి వెళ్ళినపుడు తిరిగి ఒక్కొక్కరం ఒక్కొక్క రకం అవగాహనకి చేరుకుంటాం. ఈ రకంగా మన ఐక్యత తాత్కాలికం– విభేదాలు కొనసాగుతాయి. ఇది ఇలా ఉన్నప్పటికీ, మనం మన విభేదాలని పక్కకుపెట్టి, మన ప్రధానమైన దిశకు సంబంధించి ఒక ఒప్పందానికి రావచ్చు. ఉదా॥కి హింటన్ కుటుంబ సభ్యులంతా ఒకేరకంగా ఆలోచిస్తారని నేను అనుకోను. ‘బిల్’ తల్లి అతనిలాగా ఆలోచించదు– అతని భార్య ఇంకోరకంగా ఆలోచించవచ్చు–చిన్నదైన ‘కార్మా’ తల్లిలాగా ఆలోచించదు–ఎప్పటికీ వ్యక్తులు అనేవాళ్ళు వుంటారు. అసలు వ్యక్తులు కలిస్తేనే కదా సమిష్టి అనేదుండేది?!

మాకెప్పుడూ సమిష్టే కావాలిగానీ వ్యక్తులు కాదని బూర్జువాలు మమ్మల్ని శపిస్తారు. ఇది నిజం కాదు. నిజానికి పెట్టుబడిదారులే వ్యక్తులకి ప్రాధాన్యతనిచ్చి సమిష్టి బాధ్యతని విస్మరిస్తారు. ఇది ఉత్పత్తిలో అరాచకాన్ని కలిగిస్తుంది. ఉదా॥కి పొల్యూషన్ (నీరు, గాలి కలుషితం కావడం) తీసుకోండి–పెట్టుబడిదారీ విధానంలో ఈ సమస్య పరిష్కారం కాదు. మీరు మా “ఈస్ట్ ఈజ్ రెడ్” నూనె శుద్ధి కర్మాగారాన్ని చూశారు కదా! (‘ఈస్ట్ ఈజ్ రెడ్’ అన్నది పీకింగ్ నగరానికి నైరుతి దిక్కున ఉన్న పెట్రోలియం–రసాయనాల బహుళార్థ పారిశ్రామిక సంస్థ. ఇక్కడ ప్రతి తయారీలోనూ (ప్రోసెస్) ‘వేస్ట్’ (వృథా)గా మిగిలే వాటిని ముడిసరుకులుగా తీసుకొని మరో సరుకుగా మారుస్తారు.) ఇక్కడ మేము, ‘వేస్టు’ అన్న సమస్యని పరిష్కరించాం. మేమిక్కడ బాతుల్ని, చేపలని పెంచుతాం. పనికిరాని నీళ్ళని పొలాలకి మళ్ళిస్తాం. అయినా మాకింకా తృప్తిలేదు. ఈ పనికిరాని నీళ్ళని ప్రజలు తాగగలిగినంత పరిశుభ్రంగా చేయాలనేది మా కోరిక. అందుకని ఇంకో వడపోత విధానాన్ని (ప్యూరిఫికేషన్ ప్రొసెస్) నూనెశుద్ధి కర్మాగారానికి చేర్చాల్సుంటుంది. అమెరికాలో ఇలాంటి విషయాలు ఇంత సులభంగా నడవ్వు. అమెరికాలో ‘గ్రేట్‌లేక్స్’ చెరువుల్లోనూ, సముద్రంలోనూ చేపలు చచ్చిపోతున్నాయి. దాంతో అమెరికా వాళ్ళు పెరూమీదపడి తగాదా పడుతున్నారు. ఆత్మరక్షణకోసం పెరూ, దాని చుట్టుపక్కల దేశాలూ 200 మైళ్ళ సముద్ర సరిహద్దు నెలకొల్పాయి. మా ప్రభుత్వం దీన్ని బలపరుస్తుంది. పెరూతో దౌత్య సంబంధాలు పెట్టుకోడానికి అంగీకరించిన షరతులలో ఇదొకటి. గుత్తపెట్టుబడి తన స్వంత సరిహద్దుల (షోర్స్)ని మలినపరచడమేగాక ఇతర ప్రజల సముద్ర సంపదకోసం కూడా పోతుంది.

జపాన్‌లో కూడా పొల్యూషన్ (నీరు, గాలి కలుషితం కావడం) సమస్య తీవ్రంగానే వుంది. ఈ మధ్యనే టోక్యో మేయర్ ఇక్కడికి వచ్చారు. ఆయన ఏ పార్టీకి చెందని అభ్యుదయవాది. సోషలిస్టు పార్టీకి చెందిన యాకోహోమా మేయరు కూడా వచ్చారు. వాళ్ళు ఈస్ట్ ఈజ్ రెడ్ అన్న కర్మాగారాన్ని చూడటానికి వెళ్ళారు. పొల్యూషన్ గురించి వారేం చేయదలుచుకున్నారని అడిగాను. ఇప్పుడున్న వ్యవస్థలో ఆ సమస్య పరిష్కారానికి మార్గంలేదని వారన్నారు.

అదృష్టంకొద్దీ టోక్యోలో పాతవి, చిన్నవి అయిన పరిశ్రమలే ఎక్కువ వున్నాయి. జపాన్ ముఖ్యపట్టణం కలుషితమైన నీళ్ళని మరీ పెద్దమొత్తంలో వదలదు. పెద్ద నూనెశుద్ధి కర్మాగారాలులేవు. కానీ కార్లు గాలిని కలుషితం చేస్తున్నాయి. టోక్యో నివాసులు ఈ పొగ (స్మోక్) విషయంలో నిస్సహాయులుగా వున్నారు. పీకింగ్ నిండా వున్న సైకిళ్ళని చూసి టోక్యో మేయర్ అసూయచెందారు. కానీ తమ పరిస్థితులని మార్చడానికి తానేమీ చేయజాల నన్నారు. అక్కడి గుత్తపెట్టుబడిదారులంతా తమ కార్లు అమ్ముడుపోవాలనే చూస్తారు. లాభాలకోసం వారి కార్ల అమ్మకానికి పెద్దమార్కెట్లే వారు కోరుకుంటారు. ప్రజలు పాతకార్ల బదులు కొత్త కార్లనే వాడాలని వారు కోరుతారు.

యాకో హోమాలోని పరిస్థితులింకా ఘోరంగా వున్నాయి. సముద్రపు ఒడ్డులో గల చేపలన్నీ చచ్చి పోయాయి. ఇది పెద్ద పెద్ద నూనె శుద్ధి కర్మాగారాలవల్ల జరిగింది. స్వార్థంఇంత అత్యున్నతస్థాయికి పెరిగిపోవడం– ప్రజలు ఒకరినొకరు అణచడానికీ, నష్టం కలిగించు కోవడానికీ దారితీసింది. పెట్టుబడులని ఎక్కువగా పెంచడం మాత్రమే పొల్యూషన్‌ని తగ్గిస్తుంది–కానీ, ఇది ఖర్చులని పెంచుతుంది. డబ్బుని పోగొట్టుకోవాల్సి రావచ్చు, అందుకని యజమానులు ఆ పనిని చేయరు. ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం తన వున్నత దశలో తన స్వంత దేశపరిసరాలకే హానికలిగిస్తుంది. ఇది అమానుషం! మా సోషలిజం–మరోవైపు వ్యక్తులకీ, సమిష్టికీ మధ్య మంచి సంబంధాలని వుంచుతుంది. కానీ అది, “అంతా సమిష్టే, వ్యక్తిగతం లేదు” అనేరకం గాదు. సోషలిజం, “సామాజిక ప్రయోజనాలే తప్ప, వ్యక్తి ప్రయోజనాలు లేకుండా” చేయదు. ప్రజలు తమ వ్యక్తిగత ప్రయోజనాలని సమాజ ప్రయోజనాలకు లోబడి వుండేట్టుగా చేయడం, “సామూహికం” “వ్యక్తిగతం” ఈ రెంటికీ మధ్య సామరస్యాన్ని సాధించడం మా లక్ష్యం.

దీనికి తాచాయ్ బ్రిగేడ్ (సామూహిక వ్యవసాయంలో ఆదర్శప్రాయమైనది) మంచి ఉదాహరణ. వారికి స్వంత భూములంటూ లేవు. కమ్యూనిటీ ఇళ్ళలో వీరంతా పక్కపక్కనే వుంటారు. వారి పనులన్నీ దాదాపు ఒకేరకంగా వుంటాయి. పొద్దున అందరూ ఒకే సమయానికి నిద్రలేస్తారు. కానీ అందరూ లేవరు. చిన్నపిల్లలూ, అనారోగ్యంగా వున్న వారు, ముసలివారు లేవరు. రాత్రంతా పనిచేసినవారుకూడా లేవరు. వాళ్ళు పగలు విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుంది. కాబట్టి ప్రవర్తనలో ఎప్పుడూ తేడాలుంటాయి. ఇది పబ్లిక్‌కీ, వ్యక్తికీ తేడాని తెలియచేస్తుంది. సమూహం ఒక సిస్టమ్‌ని, క్రమశిక్షణని నెలకొల్పుతుంది. అయినా తేడాలు మాత్రం వుంటాయి.

కార్మెలిటా హింటన్: కొందరు రైతులు ఒక రకం పూలమొక్క నాటుతారు, వేరేవాళ్ళు ఇంకో రకం నాటుతారు. కొందరు అసలే నాటరు?

చౌ ఎన్ లై: అవును సరిగ్గా అదే. కొందరికి కొన్ని ఇష్టం. మరికొందరికి ఇంకో రకం ఇష్టం. మరికొందరికి ఇంకో రకం ఇష్టం. ఇప్పుడు జోన్నీ పిల్లలు తాచాయ్‌లో పాలు తాగాలనుకుంటే వారు తప్పకుండా తాగాలి. (చైనా ప్రజలు పాలు తాగరు) నేను అక్కడ వుంటే వాళ్ళకు పాలు దొరికేటట్టు చూస్తాను. వాళ్ళు అనవసరమైన కష్టాలని భరించాలని మనం బలవంతం చేయకూడదు– మా లాంగ్‌మార్చ్ జరుగుతున్నపుడు, మేం ఉత్తరానికి పోయినప్పుడు, కొందరు దక్షిణాది సైనికులకి జొన్నలు అలవాటులేదు. వేం వాటితో ఈతపళ్ళు కలిపి తినేవాళ్ళం. వాళ్ళు క్రమంగా అలవాటు పడ్డారు. ఉత్తర షాన్సీ ప్రజలు కోడిపిల్లనో పందినో చంపినపుడు దాని పేగులు, లివర్‌లాంటి లోపలి భాగాలని పారేసేవారు. ఇది చాలా విచిత్రమైన ఆచారం. దక్షిణాది వారికేమో ఆ భాగాలు చాలా యిష్టం. అందుకని మేం లివర్ని, పేగుల్ని వేరే మిగిల్చి వీరికోసం వండేవాళ్ళం. క్రమంగా వీరు జొన్నలకి కూడా అలవాటు పడ్డారు. ఇంకోవైపు ఉత్తర షాన్సీ ప్రజల్ని ప్రేగులు మొ॥న వాటిని తినమంటే, వాళ్ళు కనీసం ముట్టుకోరు. అలాగే పాలకి అలవాటుపడ్డ చిన్నపిల్లల్ని ఒక్కసారిగా పాలులేని జీవితానికి అలవాటు పడమని అడగజాలం. తాచాయ్ “పబ్లిక్” మొదలు, “వ్యక్తి” తర్వాత అన్నదానికి మంచి ఉదాహరణ. పంట వచ్చిన కాలంలో మొదట పబ్లిక్ ధాన్యాన్ని (పన్ను ధాన్యం, ప్రభుత్వానికి అమ్మే ధాన్యం) ముందు వేరే పెడతారు. తర్వాత రాబోయే పంట విత్తనాలకి కొన్ని తీస్తారు. ప్రభుత్వానికి ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులో కొంత భాగాన్ని వచ్చే పంటకోసం పెట్టుబడిని, ఇల్లు కట్టడం మొ॥న నిర్మాణానికి కావల్సిన పెట్టుబడిని పక్కకు పెడతారు. కరవులు మొ॥నవి వచ్చినప్పటి కోసం కొంత ధాన్యాన్ని తీస్తారు. తర్వాత మిగిలిన ధాన్యాన్ని వాటాలవంతున పంచుకుంటారు.

అయితే ఈ చివరిభాగం ప్రతియేడూ పెరగాల్సి వుంటుంది. లేకపోతే ప్రజలు తమ ఆసక్తిని, ఉత్పత్తిమీద ఉత్సాహాన్ని నిలబెట్టుకోలేరు. ఒక బ్రిగేడ్ ఈ రకంగా సమిష్టినీ, వ్యక్తినీ అన్ని రంగాలలో సమన్వయ పరిచిందంటే ఫరవాలేదన్నమాటే. దేశానికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తుంది. కాబట్టి తాచాయ్ గురించి ప్రధానంగా చెప్పాల్సింది అది. “పబ్లిక్ మొదలు, వ్యక్తి తర్వాత”. దేశమంతా దాన్ని అనుసరించగలిగితే చాలా బాగుంటుంది. ఇలాంటి వాటిని మేము “ఆదర్శంగా” ప్రచారం చేస్తాం. ఎందుకంటే అది అభివృద్ధి చెందింది. ఇంకా ప్రజలు దాని గురించి వివరంగా తెలుసుకొని దానిలాగే చేయడానికి ప్రయత్నిస్తారు. ఎవ్వరూ దాన్ని అందుకోలేనంతగా అది అభివృద్ధిచెందితే ఇక అది ఆదర్శం ఎట్లా కాగలుగుతుంది. ఏమంటారు. నిజమేనా?

లీవెన్ ఝుంగ్, లీఫెంగ్‌లు తక్కువమందిగానే వుంటారు. వాళ్ళలాగే అందరూ చనిపోతే ఇక చేయగలిగిందేముంది? ఒక్కరూ బతికేవాళ్ళు కాదు. అదేమీ అవసరమైనది కాదు. ప్రతి ఒక్కళ్ళూ అలా మహత్తరంగా మరణించాలనుకోవడం కుదరదు. అది ఒక రకమైన ఫాసిజం, మిలటరీజం మాత్రమే అవుతుంది. అసలు అలా జరగదు. అది ప్రజాసేవ కాజాలదు. కాబట్టి మొత్తంమీద చూస్తే “పబ్లిక్ మొదట, వ్యక్తి తర్వాత” అన్నది సరైంది. దాన్నించి అందరూ నేర్చుకోవచ్చు.

సాంస్కృతిక విప్లవం సమయంలో తాచాయ్ ప్రజలు దీనిగురించి బాగా వాదోపవాదాలు చేశారు. కొందరు అతి అతివాదులు తాచాయ్ ప్రజలు పబ్లిక్ క్షేమాన్ని మాత్రమే అనుసరించారు కాని వ్యక్తి క్షేమాన్ని కాదు అని నొక్కి చెప్పారు. ఇతరులేమో ఈ ప్రచారం అంతటికీ వెనుక తాచాయ్ ప్రజలు కూడా స్వార్థాన్నే చూసుకున్నారు అన్నారు. షాన్సీ రాష్ట్ర విప్లవ కమిటీ ఛైర్మన్ క్సీజెన్ హువా తాచాయ్‌కి వెళ్ళినపుడు ఈ రెండూ తప్పేనంటూ, నిజానికి తాచాయ్ “పబ్లిక్ మొదలు, వ్యక్తి తర్వాత” అన్న సూత్రానికి మంచి ఉదాహరణ అన్నారు. ఇది తాచాయ్ ప్రజలకి కోపం తెప్పించింది. తాచాయ్ బ్రిగేడ్ నాయకుడు చెన్‌యంగ్‌కుయ్ పీకింగ్ వచ్చినప్పుడు మేం మాట్లాడాం. ఆయన సెంట్రల్ కమిటీ వైఖరియైన మా వైఖరిని బలపరిచాడు. మేమలా భావించడానికి తగిన కారణాలున్నాయి కూడా. ✡

## విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కా॥ కొల్లా వెంకయ్య వర్థంతి సభ

**కొండపాటూరు, 17-9-12:**

గుంటూరుజిల్లా, కొండపాటూరు గ్రామంలో ఎమ్ఎల్‌కమిటీ వ్యవస్థాపకులు, నల్లమడ రైతుసంఘ వ్యవస్థాపకులు కా॥కొల్లా వెంకయ్య 14వ వర్థంతి సందర్భంగా సభ నిర్వహించారు. ఈ సభకు నల్లమడ రైతుఉద్యమ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కా॥కొల్లా వెంకయ్యకు నివాళులర్పించటమంటే, నిరుపేదల భూమిసమస్య పరిష్కారంకోసం, దున్నేవానికే భూమికోసం పోరు సల్పటమేనన్నారు.

సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కా॥కొల్లా వెంకయ్య, కమ్యూనిస్టు పార్టీ జెండా చేబూనిన తొలినాటినుండీ గ్రామాలలో కులవివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు సాగించారనీ, పార్లమెంటరీ పంథాను తిరస్కరించి ప్రజాయుద్ధ పంథాద్వారానే ఈ దోపిడీవ్యవస్థను కూలదోయగలమని నమ్మి, అందుకై కృషిసలిపారనీ, విప్లవ కమ్యూనిస్టు పార్టీల ఐక్యతద్వారానే కా॥కొల్లా వెంకయ్యవంటి అమరుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళగలమని, సిపిఐ(ఎం.ఎల్) ఆ ఐక్యతా ఒరవడిని కొనసాగిస్తున్నదని పేర్కొంటూ కా॥వెంకయ్యకు నివాళులర్పించారు.

నల్లమడ రైతుసంఘం నాయకులు డా॥కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఈ దేశ సంపదలు, ఈ దేశ ప్రజలకే దక్కాలని 1929 నాటినుండి కడదాకా కా॥కొల్లా వెంకయ్య పోరాడారని, కాగా ఈనాటికీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలన్నింటా విదేశీ సామ్రాజ్యవాద గుత్తపరిశ్రమలు ఆక్రమించివున్నాయని, దేశంలోని సంపదలన్నీ పెద్దఎత్తున తరలించుకెళ్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో కనీస ప్రాతిపదికపై వామపక్ష పార్టీలన్నీ ఐక్యకార్యాచరణ సాగించవల్సిన తక్షణావసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. వందలాదిమంది గ్రామప్రజలు, ఇంకా పలు ప్రజాసంఘాల ప్రతినిధులు ఈ సభలో పాల్గొని కా॥కొల్లావెంకయ్యకు జోహార్లర్పించారు. కళాకారులు ప్రదర్శించిన ‘రైతురాజన్న’ ఏకపాత్రాభినయం ప్రజలను ఆకట్టుకుంది. ✡

## ‘రైతాంగం వాన్‌పిక్ భూముల పునఃస్వాధీనానికి నడుం బిగించాలి’

### రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రకాశంజిల్లాశాఖ విస్తృత ప్రచారం

**చినగంజాం, వేటపాలెం, 1-9-12:**

పాలకముఠాల అధికార కుమ్ములాటలో భాగంగా అనేక ఆస్తుల కుంభకోణాలు, భూకుంభకోణాలు వెలుగుచూస్తున్నాయి. అందులో భాగంగా గుంటూరు, ప్రకాశంజిల్లాలలో ‘వాన్‌పిక్’ పేరిట రైతాంగంనుండి ప్రభుత్వం వివిధ రూపాల్లో గుంజుకున్న భూములవైనం బట్టబయలవటంతో తిరిగి ఆ భూములు రైతులు, నిరుపేదలకే పున:స్వాధీనం చేయాలనే న్యాయమైన డిమాండ్ ముందుకొచ్చింది. వాన్‌పిక్ పేరుతో రైతుల భూములను గుంజుకోవటాన్ని ఆదినుండీ వ్యతిరేకిస్తూ వస్తున్న రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్), ఆ భూములను రైతాంగానికి పునఃస్వాధీనం చేయాలని డిమాండ్‌చేస్తూనే, ప్రజలు, రైతాంగమూ కదిలి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిస్తూ ప్రకాశంజిల్లా తీరప్రాంతం లోని చినగంజాం, వేటపాలెం మండల గ్రామాలైన మోటుపల్లి, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, రుద్రమాంబ పురం, రామచంద్రపాడు, నిరీక్షణగిరి తదితర గ్రామాల్లో కరపత్రాలు, సమావేశాలద్వారా విస్తృతప్రచార క్యాంపైన్ చేపట్టింది.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రకాశంజిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలితకుమారి మాట్లాడుతూ రైతులనుండి భూములను గుంజుకొన్న పాలక పార్టీలలోని ముఠాల నాయకులు, తామే దగ్గరుండి అరకదున్ని రైతుల భూములను రైతులకప్పగిస్తామనే కల్లబొల్లి ప్రచారాలను రైతాంగం విశ్వసించవద్దనీ, ప్రజల ఐక్యశక్తిపై నిలచి పోరాడటం ద్వారానే ఆ భూములను పునఃస్వాధీనం చేసుకోగలుగుతామని అన్నారు.

ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రనాయకులు కా॥ ఎమ్.ఎస్. శాయి మాట్లాడుతూ తీరప్రాంత ఇసుకలో విలువైన ఖనిజాలున్నాయనే పేరిట ఇసుకను తూర్పారబట్టే బీచ్‌శాండ్ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులివ్వటం ద్వారా ఉప్పెన, సునామివంటి పెనుప్రమాదాలకు తీరప్రాంత గ్రామాలను మరింతగా గురిచేస్తోందనీ, అభివృద్ధిపేరిట ప్రజాజీవనాన్ని, వ్యవసాయాన్ని, జీవవైవిధ్యాన్ని విధ్వంసం గావించే పాలకుల ‘విధ్వంసక అభివృద్ధి’ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు, వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు ఈ క్యాంపైన్‌లో పాల్గొన్నారు. ✡

# సామ్రాజ్యవాదుల అణ్వస్త్రాల తయారీకి అవసరమైన మూలకాల కోసం యురేనియం తవ్వకాలు-శుద్ధి ప్రక్రియలను మనదేశంలో విస్తరిస్తున్న పాలకులు

**భారతపాలకులు** తమ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల అమలు క్రమాన్ని వేగిర పరచటంలో భాగంగా, మనదేశ ప్రజలకే గాక, మానవ జాతికే అత్యంత ప్రమాదకరమైన, వినాశకరమైన చర్యలను జంకు గొంకు లేకుండా అమలు చేసుకుంటూ పోతున్నారు.

జంతు, వృక్ష...జీవజాలమంతటికీ, పర్యావరణ మంతటికీ ముఖ్యంగా మానవమనుగడకే పెనుముప్పును కలిగించే, రేడియోధార్మిక మూలకాలైన యురేనియం వంటి భూగర్భ నిక్షేపాలను సామ్రాజ్యవాద దేశాల-ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద దేశ ప్రయోజనాల కనుగుణంగా మనదేశంలో వాటిని తవ్వితీసే పనిని తలకెత్తుకుని, ఆ ప్రక్రియలను తీవ్రం చేస్తున్నారు.

ముడి యురేనియం ఖనిజాన్ని తవ్వితీసి; తవ్వితీసిన ఆ ముడి యురేనియం ఖనిజాన్ని శుద్ధిచేసి; శుద్ధిచేసిన యురేనియంను, సామ్రాజ్యవాదులు 'సాయం' చేసిన సాంకేతిక పరిజ్ఞానంతో విస్తృతంగా స్థాపిస్తున్న అణువిద్యుత్ కేంద్రాలలో విచ్ఛిత్తికి గురిచేసి; యురేనియంతో సహా అణువిద్యుత్ కేంద్రాల నుండి వెలువడే ఫ్లుటోనియం వంటి ఉప ఉత్పత్తులను ఆయా సామ్రాజ్యవాదదేశాలకు పాలకులు జేరవేస్తున్నారు. అత్యంత కాలుష్యాన్ని వెజదల్లే ఈ ప్రక్రియలు చేపట్టటానికి సామ్రాజ్యవాదులు, తమ దేశాల్లో ప్రజలనుండి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటూ, ఆ భారాలన్నింటినీ మూడవ ప్రపంచ దేశాలపై మోపుతున్నారు. అమెరికా అగ్రరాజ్య సామ్రాజ్యవాదం భూమండలంపై అదుపులేని అణ్వస్త్రాలను కలిగివుండి, ప్రపంచ దేశాలను శాసిస్తూ మరింతగా మానవజాతిని నాశనంగావించే అణ్వాయుధాలను తయారు చేసుకుంటుండగా దానికి కావలసిన యురేనియం, ఫ్లుటోనియం, థోరియం వంటి మూలకాలను భారత పాలకులు అత్యంత వినయ విధేయులతో శుద్ధి చేసిమరీ వారికి సమర్పించు కుంటున్నారు. ఒక పెద్ద కుట్రపూరిత గొలుసు పథకంలో భాగంగా భారతపాలకులు ఈ చర్యలకు తెగబడి పూనుకుంటున్నారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం విద్యుత్తులో అణువిద్యుత్తు వాటా 2.7 శాతం (4780 మె.వా.) కాగా, 2032 నాటికి అణువిద్యుత్తును 63 వేల మెగావాట్లకు పెంచాలని పాలకులు అందుకే తహతహలాడుతున్నారు. యురేనియం తవ్వకం-శుద్ధి-అణువిద్యుదుత్పత్తి-ఈ ప్రక్రియలన్నింటా జీవజాలానికే పెనుప్రమాదకరమైన విషపూరిత అణుధార్మికతకు దేశ ప్రజలను బలి చేయటానికి వారు ఎన్నికల్లబొల్లి కబుర్లు చెప్పటానికైనా వెనుకాడటం లేదు. ఈ విధంగా ప్రపంచ దేశాలను తన గుప్పెటలో నుంచుకోవాలనుకుంటున్న అగ్రరాజ్య సామ్రాజ్యవాద ఆధిపత్యకాంక్షలకనుగుణంగా ముడి పదార్థాల సరఫరాదారులుగా వంచనాత్మక చర్యలకు పాలకులు నిస్సిగ్గుగా పాల్పడుతున్నారు. ఇందుకు అడ్డుగా నిలిచిన ప్రజావ్యతిరేకత, నిరసనలన్నింటినీ మాయజేసీ, మభ్యపరిచీ, బెదిరించీ, నిర్బంధం ప్రయోగించీ... సామదాన బేధ దండోపాయాలను ప్రయోగించి మరీ అడ్డుతొలగించు కొని, సామ్రాజ్యవాదానికి నిఖార్సైన నమ్మినబంట్లుగా తమకు తామేరుజువు పరుచుకున్నారు. పైగా, పాలకుల ఈ హీనమైన, ప్రజావ్యతిరేక చర్యలను ప్రశ్నించటాన్నే నేరంగా చిత్రీకరించి, వారందరిపై 'అభివృద్ధి నిరోధకులని', 'విదేశీ ఏజెంట్ల'ని ముద్రలు వేసేందుకే గాక, వలసవాద పాలకులు రూపొందించిన 'రాజద్రోహ' నేరాన్నే ఆపాదించి, కేసులు బనాయిస్తూ నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు.

## మేఘాలయ : యురేనియం తవ్వకాలు వేగవంతం

భారతదేశంలో యురేనియం నిక్షేపాలకై వెదుకులాట, వాటిని గుర్తించటం ప్రారంభమైన తర్వాత, అణువిద్యుత్తు కార్పొరేషన్ (ఎన్‌పిసిఐఎల్)కు అనుబంధంగానున్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో యురేనియం తవ్వకాలు ప్రారంభించి, కొనసాగిస్తున్నారు.

మేఘాలయ రాష్ట్రంలోని డొమియాసిడ్ ప్రాంతంలో 1990ల నాటి నుండే యురేనియం వెలికితీత ప్రతిపాదనలు ముందుకొచ్చినప్పటికీ, దీనిని వ్యతిరేకిస్తూ ఆ ప్రాంత ప్రజలు మేధావులు, ప్రజాసంఘాలు ఆందోళనలతో ముందుకొచ్చి, ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకుండా చాలా కాలమే నిరోధించ గలిగారు. 2009 సెప్టెంబరు నాటికి 3 లక్షల 75వేల టన్నుల ముడి యురేనియం నిక్షేపాలన్నట్లుగా అంచనాలున్న ఆ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా యుసిఐఎల్ 30 సం॥లు లీజుకు తీసుకొని తవ్వకాలు ప్రారంభించింది. మేఘాలయ పశ్చిమఖాశీ కొండల్లో 92 లక్షల 20వేల టన్నుల యురేనియం నిక్షేపాలున్నట్లుగా సంబంధిత శాస్త్రవేత్తలు అంచనాలు వ్యక్తం చేస్తున్నారు. 1046 కోట్ల వ్యయంతో మేఘాలయలో ముడి యురేనియం ఖనిజాన్ని వెలికితీసి, రోజూ షుమారు 1500 టన్నుల వంతున ముడి యురేనియం శుద్ధిచేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలోనూ, పరిసరప్రాంతాలలోనూ ప్రజల ఆరోగ్యాలకు, ప్రాణాలకు జరిగేహానిని యుసిఐఎల్, రాష్ట్రప్రభుత్వం-రెండూ గాలికొదిలేశాయి.

## నల్గొండ జిల్లా : ప్రజల వ్యతిరేకత బేఖాతరు-యురేనియం తవ్వకాలకు ప్రభుత్వ ఆమోదం

మన రాష్ట్రంలో-నల్గొండజిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం, పెద్దగట్టు, సంబాపూర్‌లలో యురేనియం నిక్షేపాలు కనుగొని తవ్వకాలు చేపట్టే ప్రయత్నాలను 2003 నాటి నుండి ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తూ, అడ్డుకుంటూ వస్తున్నారు.

నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి నుండి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ వరకు యురేనియం నిక్షేపాలున్నట్లుగా సర్వేలలో కనుగొన్నారు. పెద్ద అడిశర్లపల్లి మండలంలో ఒకకోటీ 10 లక్షల టన్నులపైగా ముడి యురేనియం నిక్షేపాలున్నాయనేది ప్రభుత్వం అంచనా. ఇందుకు గాను 1315 ఎకరాల ప్రాంతంలో విస్తరించిన ఈ ఖనిజ తవ్వకాలకు 20 సం॥లపైగా కాలంపడుతుందనీ, అందుకోసం 760 ఎకరాలలో యురేనియం శుద్ధికర్మాగారాన్ని 400 కోట్లరూ॥ వ్యయంతో నిర్మించాలని యుసిఐఎల్ ప్రతిపాదించింది.

ముఖ్యంగా గత దశాబ్దకాలంపైగా ప్రజలు ఈ ప్రతిపాదనలను నిలువరిస్తూ వస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తంతులను సంఘటితంగా తిప్పికొట్టారు. ఇప్పటికే నల్గొండ జిల్లాలో 75 శాతం జనాభా ఫ్లోరోసిస్ బాధితులుగా వున్నారు. ప్రభుత్వం తలపెట్టిన యురేనియం ఖనిజం వెలికితీత-శుద్ధి ప్రక్రియలు కొనసాగితే, జిల్లాలోని ఈ ప్రాంతాలన్నీ మరింత కాలుష్యానికి గురవుతాయి. హైదరాబాదు, సికిందరాబాదు జంటనగరాలకు తాగునీరందించే అక్కంపల్లి రిజర్వాయర్, ప్రతిపాదిత తవ్వక ప్రాంతానికి నాలుగు కి.మీ. దూరంలోనే ఉన్న కారణంగా, ఈ జలాలు కూడా రేడియోధార్మికతకు గురవుతాయి. అంతేకాదు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నల్గొండ జిల్లాలకు ప్రధానంగా తాగునీరు, సాగునీరు అందించే నాగార్జునసాగర్ డ్యామ్, ప్రతిపాదిత తవ్వక ప్రాంతానికి 10 కి.మీ. దూరంలోనే వుంది. ఫలితంగా ఈ జలాలు కాలుష్యానికిగురై ఈ జిల్లాల ప్రజానీకం, పంట, పశువులు రేడియోధార్మికత ప్రభావానికి లోనవుతారు. అనేక జబ్బులబారిన పడతారు. ఇంతటి తీవ్ర పరిస్థితిని కూడా ప్రభుత్వం పెడచెవిన పెట్టి యురేనియం తవ్వకాలకే ముందుకు సాగుతోంది.

## కడప జిల్లా : యురేనియం తవ్వకాల విస్తరణ చర్యలు-యురేనియం శుద్ధికర్మాగారం ప్రారంభం

కడపజిల్లా-పులివెందుల నియోజక వర్గ పరిధిలోని వేముల మండలం-ఎం.తుమ్మలపల్లి ప్రాంతంలో ప్రజల నిరసనను బేఖాతరు చేస్తూ 1106.4 కోట్ల రూ॥ వ్యయంతో యురేనియం ఖనిజ తవ్వకాలను నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 2007 నవంబర్ 20న ప్రారంభించాడు.

ప్రజల జీవనం అభివృద్ధి చెందుతుందనీ, ఉపాధి పెద్ద ఎత్తున లభిస్తుందనీ నమ్మబలికాడు. కుటుంబంలో తప్పనిసరిగా ఒకరికి ఉద్యోగం, చక్కటి స్థిరనివాసం, మెరుగైన వైద్యం, పిల్లలందరికీ నాణ్యమైన విద్య కల్పిస్తామని 'అరచేతిలో వైకుంఠం' చూపిన పాలకుల మాటలన్నీ నీటి మాటలయ్యాయి.

2008 నుండీ యుసిఐఎల్ ఆధ్వర్యంలో భూగర్భ ముడి యురేనియం ఖనిజాన్ని తవ్వి తీస్తున్నారు. దీనికోసం 1894 నాటి భూసేకరణ చట్టాన్ని ఉపయోగించి ప్రజా ప్రయోజనాలపేరిట ఎం. తుమ్మల పల్లితోపాటు రాచకుంటపల్లి, మబ్బుచింతపల్లి తదితర పరిసర గ్రామాలలో 1100 ఎకరాల భూమిని రైతులనుండి గుంజుకున్నారు.

ఈ భూములన్నీ నిక్షేపంగా పంటలు పండే భూములే. ఇవిగాక, మరో 1300 ఎకరాల ప్రభుత్వ భూములను కూడా యురేనియం తవ్వకాలకు కట్టబెట్టారు. రాష్ట్రంలో, కడప జిల్లాలోనే అత్యధికంగా యురేనియం నిల్వలున్నట్లుగా సర్వేలద్వారా ప్రకటించారు. ఇక్కడనుండి తవ్వితీసే ముడియురేనియంలో 0.03 శాతమే శుద్ధయురేనియం కాగా, 99.97 శాతం కాలుష్యపూరిత వ్యర్థాలుగా మిగిలి పోతాయి. నాలుగు సం॥ క్రితం ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు ప్రారంభమైననాటినుండీ పరిసర గ్రామాల ప్రజానీకం తీవ్రకాలుష్య ప్రభావానికి లోనవుతున్నారు. అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. పరిసర గ్రామాల్లో బోరు బావుల్లోనీరు అడుగంటిపోయింది. 1000 అడుగుల వరకూ తవ్వినా నీరు పడటం లేదు. ఒకవేళ లభించినా ఆ నీరు అణుధార్మికతతో కూడి ప్రమాదకరంగా పరిణమించింది. ఈ నీరు నిల్వచేసిన పాత్రలు చిల్లులు పడిపోతున్నాయి. భూగర్భంలో నుండి తవ్వితీసి, ఇప్పటికే ఆరులక్షల టన్నుల ముడి యురేనియంను తుమ్మలపల్లి ప్రాంతంలో గుట్టలుగా పోశారు.

ఇక, ఈ తవ్విపోసిన ముడిఖనిజాన్ని శుద్ధి చేసేందుకు ఈ సంవత్సరం ఏప్రిల్ 20న యుసిఐఎల్ ఛైర్మన్ చేతులమీదుగా శుద్ధిచేసే కర్మాగారాన్ని ప్రారంభించారు. శుద్ధిచేసిన పిదప ఈ కర్మాగారం నుండి ప్రతిరోజూ వేలాది టన్నుల వ్యర్థాలు పైపులైన్లు ద్వారా సుదూరంగా నిర్మించిన టైలింగ్ పాండ్‌కు తరలిస్తున్నారు. ఈ శుద్ధిచేసే ప్రక్రియ ప్రారంభమైన గత 4,5 మాసాల వ్యవధిలోనే విషకాలుష్యాన్ని మోసుకెళ్ళే పైపులైను లీకైంది. అణుధార్మిక వ్యర్థాలు అక్కడి నేలమీద ప్రవహించిన మేరా పచ్చిని గడ్డి, చిన్నచిన్న మొక్కలు అన్నీ కొన్ని గంటల వ్యవధిలోనే పచ్చదనాన్ని కోల్పోయాయి-మొక్కలు నిలువునా ఎండిపోయాయి.

ఇదిలావుంటే, రోజుకు మూడువేల టన్నుల చొప్పున ముడి యురేనియంను శుద్ధిచేయాలంటే, మరింత ఎక్కువగా ముడిఖనిజాన్ని సరఫరా చేయాలని, అందుకుగానూ రాచకుంటపల్లివద్ద యురేనియం తవ్వకాల రెండవదశ విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వాధికారులు సన్నాహాలలో వున్నారు. ఇప్పటికే తమకు ఎదురైన చేదు అనుభవాలతో ప్రజలు ఈ విస్తరణ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మొదటిదశలో భూగర్భంలో 900 అడుగుల లోతున తవ్వకాలు చేపట్టగా, రెండవదశలో 1670 అడుగుల లోతున తవ్వకాలు సాగించనున్నట్లు యుసిఐఎల్ అధికారులు ప్రకటించారు.

కాగా, యురేనియం శుద్ధికర్మాగారాన్నుండి ప్రతిరోజూ వెలువడే వేలాది టన్నుల వ్యర్థాలను తరలించుకెళ్ళి, నింపేందుకు గానూ సుదూరంగా టైలింగ్ పాండ్స్‌ను నిర్మించారు. ఈ ప్రాంతంలో లభ్యమయ్యే ఖనిజ నిల్వలను బట్టి 30 సం॥లపాటు తవ్వకాలు-శుద్ధి ప్రక్రియ సాగుతుందని అంచనావేస్తూనే, 8 సం॥లకు సరిపడిన టైలింగ్ పాండ్స్‌ను మాత్రమే నిర్మించారు.

## యురేనియం కోసం మరింత వెతుకులాట-తవ్వకాలకు చర్యలు

కర్ణాటక రాష్ట్రం-గుల్బర్గా జిల్లా-గోగిలో; రాజస్థాన్ రాష్ట్రం-సికార్‌జిల్లా రోహిలి ప్రాంతంలో యురేనియం నిక్షేపాలున్నట్లుగా గతంలోనే కనుగొన్నారు. తవ్వకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఝార్ఖండ్ రాష్ట్రం-జాదుగూడ ప్రాంతంలో 48వేల టన్నుల యురేనియం నిల్వలున్నాయంటూ అక్కడ గనులతవ్వకం- శుద్ధి ప్రక్రియలు కొనసాగిస్తున్నారు.

గుంటూరు జిల్లా కొప్పునూరు ప్రాంతంలోనూ; రాజస్థాన్ రాష్ట్రం-జైపూర్‌జిల్లా, నయాగావ్‌లలో యురేనియం నిక్షేపాలను ఇటీవలే కనుగొన్నట్లుగా 'ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్' శాస్త్రవేత్తలు ప్రకటించారు.

మనరాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో తాగునీరు, భూగర్భజలాలు-ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్ణయించిన సురక్షిత ప్రమాణాలకు భిన్నంగా 135 రెట్ల సాంద్రతను కలిగివున్నాయని కనుగొన్నారు. జిల్లాలోని వాగళ్ళ మరియు పరిసర ప్రాంతాలలో అధ్యయనం ద్వారా తాగునీరు, బావుల్లో నీటిలో ఒక మిల్లీ లీటరుకు 20 నానో గ్రామ్స్ ఉండాల్సివుండగా ఇక్కడ ఒక మిల్లీ లీటర్ నీటికి 2700 నానోగ్రామ్స్ వున్నాయని 'జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' సంస్థకు చెందిన హైదరాబాద్, కలకత్తా విభాగాలు ఈ ప్రాంతంలోని నీటి నమూనాలను పరీక్షించి ఈ వివరాలు వెల్లడించాయి. కొన్ని గ్రామాలలో ప్రజలు ఇప్పటికే తీవ్ర ఆరోగ్య సమస్యల నెదుర్కొంటున్నారు. నీటిలో యురేనియంతో పాటుగా స్ట్రాన్షియం, మాంగనీస్, వంటి ఖనిజాల సాంద్రత ఎక్కువగావుందనీ, నల్గొండ తర్వాత తాగునీరు, భూగర్భజలాలలో కాలుష్యం అధికంగా వున్న జిల్లాగా చిత్తూరు ఉందనీ 'ఆటమిక్ మినరల్స్ డైరక్టరేట్' తన సర్వేలో వెల్లడిచేసింది. తమ సర్వేల ద్వారా ప్రజల జీవితాలు ఎదుర్కొనే పలుదుష్ఫలితాల గురించి తెలుసుకోని, వాటిని నివారించే చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వం, ప్రజలను మరింత కాలుష్యకోరలలోకి తానే పడదోస్తోంది.

మనదేశ అవసరాలకు, మన ప్రజల అవసరాలకు ఏ మాత్రం ఉపయోగపడని; పైగా మన దేశప్రజల జీవితాలతో, ఆరోగ్యాలతో, పర్యావరణంతో చెలగాటమాడే, ప్రజలను నిరంతర వ్యాధిగ్రస్తులుగా మార్చివేసే యురేనియం ఖనిజ తవ్వకాలు-శుద్ధి ప్రక్రియలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేయాలి. సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా, అణ్వస్త్రాల తయారీకి అవసరమైన ముడిసరుకు అవసరాలు తీర్చేందుకే భారత పాలకులు మన దేశంలో ప్రజల పాలిట అత్యంత ప్రమాదకరమైన ఈ చర్యలు చేపట్టారనేది స్పష్టం. యురేనియం తవ్వకం-శుద్ధి-విస్తరణ కొత్తగా ప్రారంభించ దలిచిన ప్రాంతలన్నింటా వెంటనే ఆ ప్రతిపాదనలు ఉప సంహరించుకోవాలని, మానవ జాతికే పెను విపత్తుగా పరిణమించనున్న అణువిద్యుదుత్పత్తిని ఆపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఉద్యమించాలి. ✡

---

**పత్రికా ప్రకటన**

# సింహళ పౌరులపై దాడులను ఖండించండి!

## న్యూడెమోక్రాటిక్ మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ -శ్రీలంక

**సామాన్య** పౌరులైన సింహళ తీర్థయాత్రీకులపై సాగుతున్న నిరసనలూ, దాడులూ జుగుప్సాకర జాతివివక్షతలో భాగమే. ఇలాంటి సంకుచిత మనస్క కార్యకలాపాలు శ్రీలంక తమిళులకు సహాయపడవు. జాతీయ మనోభావాల పేరిట సాగుతున్న ఈ జాతి వివక్షతా నిరసనలూ, దాడులనూ న్యూ డెమోక్రాటిక్ మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. అలాంటి కార్యకలాపాలు శ్రీలంకలో జాతీయోన్మాదాన్ని సమర్థిస్తాయి; జాతి వ్యతిరేక హింసాకాండను రెచ్చగొట్టడానికి తోడ్పడతాయి.

అధ్యక్షుడు మహేంద్ర రాజపక్సే నాయకత్వంలో శ్రీలంకలో జాతీయోన్మాదం సాగిస్తున్న అణచివేత కొనసాగుతున్నది. జాతి అణచివేతకు గురవుతున్న శ్రీలంక తమిళులకు మద్దతు తెలుపటమూ, వారిని ఓదార్చటంతో పాటుగా, న్యాయమైన రాజకీయ పరిష్కారాన్ని కోరటమూ తమిళనాడు ప్రజల నైతిక బాధ్యత. శ్రీలంక తమిళులకు తమిళనాడు ప్రజలందిస్తున్న ఇలాంటి మద్దతును 'తమిళ మనోభావాల' పేరిట, 'ద్రవిడ ఉద్యమ' పార్టీలు తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాల కొరకు దుర్వినియోగపరుస్తున్నాయి. దీని కోసమే సింహళ విద్యార్థి క్రీడాకారులకు నిరసనలూ, తీర్థయాత్రకు వెళ్లిన వారిపై దాడులు సాగాయి. జాతీయోన్మాద శ్రీలంక పీడకులకూ, సామాన్య సింహళ పౌరులకు మధ్య తేడాను చూడలేని తమిళ ఉన్మాదశక్తులు చేస్తున్న జాతి వివక్షతాదాడులివి. కనుక అలాంటి దాడులను తక్షణమే ఆపివేయాలని పార్టీ పునరుద్ఘాటిస్తున్నది.

7-9-2012

**ఎస్.కే. సెంతివేల్**
ప్రధాన కార్యదర్శి
న్యూడెమోక్రాటిక్ మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ, శ్రీలంక

# ఒరిస్సా చట్టబద్ధపాలనను బడా బూర్జువాల కప్పజెప్పిన ప్రభుత్వం

**కార్మికుల** శ్రమ శక్తిని దోచుకుంటున్న క్రమాన్ని మరింత తీవ్ర పరిచే చర్యలకు బడాబూర్జువా వర్గం తలపడుతున్నది. ఏ హక్కులూ లేకుండా కార్మికులు బానిసల్లా తమవద్ద పనిచేయాలని వారు కోరుకుంటున్నారు. అందుకోసం కార్మికుల హక్కులకు రక్షణ కల్పించేవని చెప్పుకుంటున్న కార్మిక చట్టాలను సవరించాలని పదేపదే ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నారు. వారి వాదనలకు పాలకులు వంతపాడుతున్నారు. కార్మిక చట్టాల సంస్కరణ, సవరణ అంటూ పదే పదే మాట్లాడటమే తప్ప నిర్దిష్టంగా ఏ చట్టంలో ఏ సవరణ చేయాలో చర్చించకుండా అయోమయ స్థితి కల్పిస్తున్నారు. ఈ సందడిలో పొరుగు సేవలు, కాంట్రాక్టీకరణ మొదలైన పేర్లతో ఏ హక్కులూ లేని తాత్కాలిక పనివారుగా కార్మికులను నియమించుకుంటున్నారు. ఇదంతా చట్ట విరుద్ధమైనా పాలకులు కిమ్మనకుండా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలుకూడా ఈ పద్ధతినే పాటించి కార్మికులపై శ్రమదోపిడీని తీవ్రం చేస్తున్నాయి.

ఎంతగా అననుకూలపరిస్థితులునెలకొన్నప్పటికీ, తాత్కాలిక పనివారుగా ఉన్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాట పథాన్నెంచుకుంటున్నారు. విశాఖ ఉక్కు మిల్లు, యానాంలోని రీజన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ, మారుతీ సుజుకీ కార్ల ఫ్యాక్టరీల కార్మికుల పోరాటాలు దీనినే తెలుపుతున్నాయి. పరిశ్రమాధిపతులు కార్మికులను అణచివేసేందుకు తమ స్వంత సెక్యూరిటీ దళాలను చట్టాలకు తెలిపీ, ప్రైవేటు గుండాదళాలను చట్టం వెనుకనా నియమించుకుంటున్నాయి. ఈ ప్రైవేటు దళాలు కార్మికులను వేధించటం, ఘర్షణ పడటం, కాల్పులకు దిగటం పరిపాటి అయింది. ఈ ప్రైవేటు దళాల కాల్పులలో అనేక సందర్భాలలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

దీనితో ఈ చట్ట విరుద్ధ చర్యలకు చట్టబద్ధత కల్పించేందుకు పూనుకున్నారు. ఈ భద్రతాదళాలను ప్రభుత్వమే సరఫరా చేసి, వారిని ఇష్టం వచ్చిన రీతిలో వాడుకొమ్మని బడాబూర్జువాలకు అధికారమిస్తున్నది. ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. ఒడిషా పారిశ్రామిక భద్రతా దళం బిల్లు 2012ను (ఒడిషా ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు బిల్-ఓఐఎస్ఎఫ్ బిల్లు) ఒరిస్సా శాసన సభ 2012 ఆగస్టు 28న ఆమోదించింది.

ఒరిస్సా రాష్ట్ర శాసనసభ ఈ బిల్లును ఆమోదించిన నేపథ్యాన్ని పరిశీలించాలి. బిల్లును ప్రవేశపెడుతూ గృహ-పట్టణశాఖామంత్రి రఘునాధ్‌మిశ్రా రాష్ట్రం త్వరితగతిన పారిశ్రామికీకరణ చెందుతున్నందునా, వామపక్ష తీవ్ర వాదం నుండి దాడులు సాగుతున్నందునా, పారిశ్రామిక సంస్థలకు భద్రత చేకూర్చవలసిన అవసరమేర్పడిందనీ, అందుకోసం ఒక ప్రత్యేక భద్రతా దళాన్ని ఏర్పాటు చెయ్యాలని శాసన సభ స్థాయి సంఘం చేసిన సూచన మేరకు బిల్లును ప్రవేశపెడుతున్నాననీ చెప్పారు. అదే సమయంలో ఆయన చెప్పకుండా మౌనం వహించిన అంశాలుకూడా వున్నాయి.

రాష్ట్ర త్వరిత పారిశ్రామికీకరణ పేరున విదేశీ గుత్తపెట్టుబడిదారులకు ఒరిస్సా సహజ వనరులను ధారాదత్తం చేశారు. ఆ విదేశీ కంపెనీలతో చేసుకున్న అవగాహనా ఒప్పందాలలో వారికి అన్ని విధాలా భద్రత కల్పిస్తామని అంగీకరించారు. ఉదాహరణకు పోస్కో కంపెనీతో చేసుకున్న ఒప్పందంలోని 17వ క్లాజు ఇలా వుంది : “చట్టప్రకారం అవసరమైన అన్ని భద్రతలను ఒరిస్సా ప్రభుత్వం అందిస్తుంది. ప్రాజెక్టులోని అన్ని విభాగాలకూ కోరిన విధంగా, వాటి స్థలంలోనే పోలీసు స్టేషన్ల ఏర్పాటుతో సహా, ఏర్పాటు చేస్తుంది”. దీని ప్రకారమే ఈ ప్రైవేటు పరిశ్రమల వద్ద ఇంతవరకూ 27 పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఆ పోలీసు స్టేషనుకు పౌరుడు వెళ్లాలంటే (ప్రభుత్వ అంగంగా అది ప్రజలందరికీ అందుబాటులో వుండాలి) ఆ పరిశ్రమకు చెందిన ప్రైవేటు సెక్యూరిటీ నుండి అనుమతి పొందాలి. పరిశ్రమ స్థలంలోనే వున్న ఈ పోలీసు స్టేషన్లు పరిశ్రమాధిపతులు సాగిస్తున్న చట్టవిరుద్ధచర్యలపై కేసు నమోదు చేసిన దాఖలా ఒక్కటి కూడా లేదు. ఇవన్నీ ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలల్లోనే ఉన్నాయి. తమ భూములు, అడవి, గ్రామాలనుండి తరిమేసి, తమ జీవనోపాధినీ, జీవనాన్నీ ఛిద్రం చేస్తున్న ఈ విదేశీ కంపెనీల కార్యకలాపాలను ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. టాటా కంపెనీపై పోరాడుతున్న కళింగనగర్ ప్రజలపైనా, పోస్కో కంపెనీ దురాగతాలను ప్రతిఘటిస్తున్న ఆదివాసులపైనా పాశవిక నిర్బంధకాండనే ప్రభుత్వం సాగించింది. ఈ నేపథ్యంలో నేటి బిల్లు తమ హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలను అణచివేసి, విదేశీ, దేశీ బూర్జువాల దోపిడీ ప్రయోజనాలను కాపాడేందుకేనన్నది స్పష్టం.

ప్రభుత్వరంగ సంస్థలకు భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, తన ఆధీనంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాన్ని (సిఐఎస్ఎఫ్) ఏర్పాటు చేసింది. ఇటీవల ఇది ప్రైవేటు పరిశ్రమలకు కూడా భద్రత కల్పించటం మొదలు పెట్టింది. సిఐఎస్ఎఫ్ తరహాలోనే ఒక దళాన్ని ఈ బిల్లు ద్వారా ఏర్పాటు చెయ్యటానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. భద్రత కల్పించమని కోరిన ప్రైవేటు పరిశ్రమలకు ఒరిస్సా రాష్ట్ర దళం భద్రత కల్పిస్తుంది. దీనికయ్యే ఖర్చును ఆ పరిశ్రమ ప్రభుత్వానికి చెల్లిస్తుంది. ఒకసారి భద్రతా దళాన్ని పరిశ్రమ కొరకు పంపిన తర్వాత ఆ దళంపై పూర్తి ఆజమాయిషీ, పాలనాధికారమూ పరిశ్రమయాజమాన్యం ఆధీనంలోవుంటుంది. అంటే దళం పూర్తిగా యాజమాన్యం చెప్పుచేతల్లో వుంటుంది. అది ప్రైవేటు దళంగా మారిపోతుంది. అయినప్పటికీ దానికి పోలీసులకు కూడా వుండని అధికారాలు కట్టబెట్టారు. ఎవరినైనా అరెస్టు చెయ్యాలన్నా, ఎవరింటినన్నా సోదా చెయ్యాలన్నా పోలీసులు మేజిస్ట్రేటు నుండి వారంటు పొందాలి. ఈ భద్రతాదళానికి వారంటు అవసరం లేకుండా ఎవరినైనా అరెస్టు చేసే, ఎవరింటినైనా సోదా చేసే అధికారాన్నిచ్చారు. ఇంతేకాక, ఇలా చేసినందుకు వారిపై ఏ కోర్టులోనూ నేరారోపణ చెయ్యరాదని చెప్పారు. “తమ విధి నిర్వహణలో భాగంగా” వారు చేసిన చర్యలన్నింటికీ వారికి బాధ్యత లేకుండా (ఇమ్యూనిటీ) చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి పొందకుండా ఈ దళ సభ్యులపై నేరారోపణను న్యాయస్థానాలు అనుమతించరాదు. రాష్ట్ర ప్రభుత్వమంటే ఎవరో బిల్లులో నిర్దిష్టపరచలేదు. అంటే అది రాష్ట్ర మంత్రి వర్గమూ కావచ్చు, జిల్లా కలెక్టరూ కావచ్చు లేదా తాసిల్దారు కావచ్చు. ఆచరణలో ప్రభుత్వం ఎలాంటి అనుమతి యివ్వకుండా జాగ్రత్త పడింది.

ఈ “ప్రజాస్వామ్య” సమర్థకులు సమాజంలోని వర్గాలకు అతీతంగా ప్రభుత్వం వుంటుందనీ, అన్ని వర్గాలూ చట్టం ముందు సమానమనీ, వర్గాలకు అతీతంగా రాగద్వేషాలు లేకుండా చట్టాన్ని అమలు జరుపుతుందనీ అంటారు. చట్టబద్ధపాలనతో సమాజంలో శాంతి భద్రతలను కాపాడటం దాని విధ్యుక్త ధర్మమని చెబుతారు. ఈ ధర్మపన్నాలు వల్లిస్తూనే దోపిడీ వర్గాల పనుపున ప్రజలపై విరుచుకుపడటం పాలకుల నైజమని గత 65 ఏళ్ళుగా సమ్మె జేసిన, హక్కులకోసం నిలిచిన వివిధ వర్గాల ప్రజల కఠిన అనుభవం తెలుపుతున్నది.

శాంతి-భద్రతల నిర్వహణ తన కర్తవ్యంగా నిర్వహిస్తున్నానని చెప్పుకుంటూనే దోపిడీ వర్గానికి అనుకూలంగా తన అధికారాన్ని ప్రభుత్వం వాడుతూ వచ్చింది. ఇప్పుడా అధికారాన్నంతా దోపిడీ పరిశ్రమాధిపతికి కట్టబెట్టి, తన పోలీసు దళాన్ని కూడా దాని ఆధీనంలో వుంచేందుకు ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది. శాంతి భద్రలకు పరిశ్రమాధిపతి యిచ్చిన నిర్వచనమే చట్టంగా చలామణి అవుతుంది. దానిని రక్షించటానికి రాష్ట్ర పోలీసు పూనుకుంటుంది. తన ఇచ్ఛవచ్చిన తీరులో చెలరేగిపోయేందకు పరిశ్రమాధిపతులకు లైసెన్సునిచ్చింది.

ప్రైవేటు పరిశ్రమలు నియమించుకుంటున్న సెక్యూరిటీ సిబ్బందికి ఇలాంటి అధికారాలుండవు. వారిస్థానంలో ప్రభుత్వ దళమని చెప్పుకుంటూ, వారు చేసే చర్యలు వేటిపైనా విచారణ జరగకుండా చేస్తూ, వాటిని దోపిడీ యజమాని ఆధీనంలో వుంచటం, ఆ విధంగా కార్మికులను, పరిశ్రమ బాధితులైన ప్రజలనూ అణచివేయటం లక్ష్యంగా ఈ బిల్లును ఒరిస్సా ప్రభుత్వం చట్టంగా చేసింది. ఇక పరిశ్రమాధిపతి చెప్పిందే చట్టమౌతుంది. మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మార్గాన్నే అనుసరిస్తాయి. కార్మికుల, ప్రజల హక్కులనూ కాలరాచి వారిని బానిసలుగా మార్చి, దోపిడీ వర్గాలకు పాలనాధికారాలను బదిలీ చేస్తున్న ఈ నిరంకుశ చట్టాన్ని వ్యతిరేకించాలి.

✡

# ఔషధ ప్రయోగాలు భారత ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

**సామ్రాజ్యవాద** బహుళజాతి మందుల కంపెనీలకు భారతదేశం ప్రయోగశాల అయింది; భారత ప్రజలు ప్రయోగజంతువులయ్యారు. ఈ ప్రయోగాలలో అనుసరించవలసిన పద్ధతులన్నింటినీ గాలికి వదలివేసి భారత ప్రజల ఆరోగ్యాన్ని బలిగొంటున్నారు. శాస్త్రవిజ్ఞాన అభివృద్ధి, ఆరోగ్యరక్షణ, వృత్తి నీతి సూత్రాలన్నింటినీ వాణిజ్య ప్రయోజనాలు త్రోసిరాజంటున్నాయి. ఇంత వరకూ భారత ప్రభుత్వం మందుల ప్రయోగాలను నియంత్రించే విధివిధానాలను రూపొందించలేదు. ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఏ వైద్యుడైనా తన ఆస్పత్రిలో ఈ ప్రయోగాలు నిర్వహించవచ్చును. మందుల కంపెనీలు వైద్యులతో సంబంధాలేర్పరచుకుని తమ మందుల ప్రయోగాలను నిర్విహింపచేస్తున్నాయి. బహుళజాతి కంపెనీలు మందునిబట్టి కనీసం రు।। 50 వేలనుండి గరిష్టంగా రూ. 3లక్షల వరకూ ఒకపేషెంటుపై ప్రయోగం జరిపినందుకు వైద్యునికి చెల్లిస్తున్నాయి. దీనికోసం ఔషధ ప్రయోగ సంస్థలు (సిఆర్ఓ) కూడా ఏర్పడ్డాయి. వీటి ద్వారా కూడా మందుల కంపెనీలు ప్రయోగాలు జరిపిస్తున్నాయి.

మందుల ప్రయోగాలకు ఎక్కువ మంది రోగులను సమీకరించి, త్వరగా వాటిని పూర్తి చేయగల వైద్యులనే ఇవి ఎంచుకుంటున్నాయి. ఈ ప్రయోగాలను పర్యవేక్షించేందుకు నీతి నియమాల కమిటీలున్నాయనీ, అమెరికాలో పాటిస్తున్న నియమాలనే ఇక్కడ కూడా పాటిస్తున్నామనీ మందుల కంపెనీలు చెప్పుకుంటున్నాయి. తాము అంతర్జాతీయ సూత్రాలనే పాటిస్తున్నందున భారత ప్రభుత్వం ప్రత్యేకంగా వీటిని రూపొందించవలసిన అవసరం లేదన్నది ఈ వాదన సారాంశం. దీని నంగీకరించి, విదేశీ మారకద్రవ్యం కొరకు ప్రభుత్వం మన్నుతిన్న పాములా నిద్రనటిస్తున్నది. నీతికమిటిలు మందుల కంపెనీల కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్న తీరు గత ఏడాది “జనశక్తి” వివరించింది. ప్రయోగాలు సక్రమంగా జరిగాయంటూ ఈ కమిటీ సభ్యులు ప్రయోగాలు ముగియకుండానే సంతకాలు చేసిన ఉదంతాలనుపేర్కొంది. ఫలితంగా తాము తీసుకుంటున్న మందేమిటో, దాని దుష్ప్రభావం తెలియకుండానే భారత ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతున్నారు.

ఈ ఔషధ ప్రయోగాలలో పాల్గొంటున్న వారిలో 438 మంది 2011లో మృతి చెందారు. వీరికి వైద్యమందిస్తున్న వైద్యులు మందుల ప్రయోగం వల్ల మరణం సంభవించి వుండొచ్చని భావిస్తున్నారు. అయినా వారు ఇతర కారణాలతో మరణించారని మందుల కంపెనీలు వాదిస్తున్నాయి. వీరికి చెందిన 16 కుటుంబాలకు మాత్రమే కంపెనీలు నష్టపరిహారం చెల్లించాయి. రూ. 50 వేలు చెల్లించి చేతులు దులుపుకున్నాయి.

ఇదంతా డబ్బులకు కక్కుర్తిపడే వైద్యుల్లో సిఆర్ఓలో చేస్తున్న పనికాదు. ప్రపంచంలోని పెద్ద కంపెనీలు సాగిస్తున్న వంచన. డ్రగ్‌కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ - భారత మందుల నియంత్రణాధికారి) అందజేసిన వివరాల ప్రకారం నోవార్టిస్ కంపెనీ నిర్వహిస్తున్న మందుల ప్రయోగాలలో 57 మంది, క్వినెటైల్స్ కంపెనీ ప్రయోగాలలో 32 మంది; ఫైజర్, బేయర్ కంపెనీల ప్రయోగాలలో చెరి 20 మంది; బ్రిస్టల్ మేయర్ స్క్విబ్ కంపెనీ ప్రయోగాలలో 19 మంది, ఎంఎస్‌డి ఫార్మాసుటికల్స్‌లో 19 మంది మరణించారు. ఇవన్నీ విదేశీ కంపెనీలు.

దేశీయ కంపెనీలని పిలిచే సన్‌ఫార్మా ప్రయోగాలలో 9 మంది, జుబిలియంట్ క్లినిసిస్‌లో ముగ్గురు, రెడ్డీ ల్యాబ్స్‌లో ఒకరు మరణించారు. అయినా జుబిలియట్ తన ప్రయోగాలలో ఎవరూ మరణించలేదని తెలిపింది.

ఈ ప్రయోగాలు జరిగిన వారు రోగులనీ, దీర్ఘవ్యాధి పీడితులనీ, కొత్తమందును వాడి చూడటానికి అంగీకరించిన వారనీ, వారి మరణానికి దీర్ఘవ్యాధే కారణం గాని, తమ ప్రయోగాలు కాదనీ ఈ కంపెనీలు వాదిస్తున్నాయి. ఈ మందుల ప్రయోగాలు ఐదుదశల్లో జరుగుతాయి. మొదటి మూడు దశల్లో జంతువులపై ప్రయోగించి చూసిన మందులను ఆరోగ్యంగా వున్న మనుషులపై వాడతారు. మందు ప్రభావాలను గుర్తించటంకన్నా, మందు ఎంత మోతాదు ఇవ్వాలి, ఏ మోతాదులో ఇస్తే రక్తంలో ఎంత స్థాయికి చేరుతున్నది, ఎంత సేపటికి పనిచేస్తున్నది గమనిస్తారు. ఈ ప్రయోగాల వల్ల ఆరోగ్యానికి జరిగే హాని ఎక్కువ. అందువల్ల కఠినతర నిబంధనలను విదేశాలలో విధించారు. ఉదాహరణకు వీరికి తరువాత వచ్చే రోగాలకు, ప్రయోగించిన మందులకు సంబంధం లేదని నిరూపితమయ్యేవరకూ వారి వైద్య ఖర్చులు కంపెనీ భరించాలి. అన్ని సమస్యలూ వివరించి వారినుండి అనుమతి పొందాలి. ప్రయోగాలకు ముందుకొచ్చేవారు తక్కువ. కనుక ఈ కంపెనీలన్నీ ఎలాంటి నియమ నిబంధనలూ లేని భారతదేశం మీద పడుతున్నాయి. పేదలచేతిలో కొంతడబ్బు పెట్టి మందులు ప్రయోగించి రక్తనమూనాలు తీసుకుని పంపించి వేస్తున్నాయి. ఏ రక్షణ బాధ్యతలూ తమకు లేనట్లు వ్యవహరిస్తున్నాయి. పల్నాడు ప్రాంతంలో మహిళలపై జరిగిన ప్రయోగాలు దీనిని తేటతెల్లం చేశాయి. ఒకరోజు రక్తనమూనా ఇస్తే డబ్బిస్తామని ఆశచూపి, వీరిపై మందుల ప్రయోగాలు సాగించారు. మందుల గురించిగానీ, వాటి దుష్ప్రభావాల గురించి కానీ చెప్పిందిలేదు. వారు దుష్ప్రభావాల బారినపడగా మాకేమీ సంబంధంలేదన్నాయి. ఆందోళనసాగటంతో ప్రభుత్వం హడావుడిచేసి ఒక్క రోజులో మందుల ప్రయోగాలకు, వారి వ్యాధికి సంబంధంలేదని చెప్పింది. వివాదాస్పద సిఆర్ఓను కొన్నాళ్లు మూసివేసింది.

తమ ప్రయోగాల బాధ్యతను నాలుగు, ఐదవదశ ప్రయోగాల్లో మందుల కంపెనీలు నిరాకరించలేవు. మొదటి మూడు దశల ప్రయోగ ఫలితాలను సమర్పించి ఇది ఒక రోగాన్ని తగ్గించటంలో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నామని, రోగులపై ప్రయోగించేందుకు అనుమతించమని కోరుతాయి. అనుమతి పొందిన తర్వాత ప్రయోగాలు నిర్వహిస్తాయి. వీటికి కూడా భారత ప్రజలనే బలిపశువులను చేస్తున్నాయి. వీరికి అనుమతినిచ్చేది అమెరికా లేదా యూరపు దేశాలలోని మందుల నియంత్రణాధికారులు. వాటిని చూపి భారత్‌లో ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. విదేశాలలో అయితే ప్రయోగాలకు అంగీకరించిన రోగులకు వారి జీవితకాలంపాటు కంపెనీలే వైద్య సేవలందించాలి. ఈ ప్రయోగాలు అక్కడ నిర్వహిస్తే అన్నీ సక్రమంగా జరిగితే మందులు అమ్మకానికి తయారవటానికి 15 ఏళ్లు పడుతుంది. భారత్‌లో మూడు నుండి ఐదేళ్లలో పూర్తి చేస్తున్నారు. ఉచిత వైద్య సేవల ఊసులేదు.

గత ఏడాది ప్రయోగ సమయంలో మరణించిన వారిలో అతికొద్ది మందికే నష్టపరిహారం చెల్లించారు. అది తరచుగా రు. 50 వేల నుండి లక్షరూపాయల వరకూ వుంటున్నది. కీళ్లవాతం జబ్బుకు పరీక్షిస్తున్న టాస్కోటినిబ్ మందు ప్రయోగంలో మరణించిన ఒకరికి మాత్రమే ఫైజర్ కంపెనీ రు. 5 లక్షలు నష్టపరిహారంగా చెల్లించింది. జర్మనీ కంపెనీ ఫ్రెసెనియస్‌కాబి తన కాన్సరు మందు పెక్లిటాక్సెల్ ప్రయోగంలో మరణించిన ఇద్దరికి రు. 50 వేలు చెల్లించింది. ఎంటి 102 అన్న రహస్య నామం గల మందు ప్రయోగంలో మరణించిన రోగికి రు. 50 వేలు మాత్రమే వీడా అన్న సిఆర్ఓ చెల్లించింది.

ఇంత చౌకగా భారత ప్రజల ప్రాణాలతో చెలగాటమాడగలిగినందునే, ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా వుంటున్నందునే, మందుల కంపెనీలు భారత ప్రజలను ప్రయోగశాల జంతువులుగా వాడుకుని అవతలకు విసిరి వేస్తున్నాయి. దీనితో మందుల కంపెనీలు తామే ఇక్కడ పరిశోధనా శాలలను నెలకొల్పుతున్నాయి. ఇలా నెలకొల్పటంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తర్వాత మందుల కంపెనీలే రెండవ స్థానంలో వున్నాయి. ఇలా నెలకొల్పడానికి “స్థానిక వనరులు” చౌకగాలభ్యమవటమే ప్రధాన కారణమని ఒక అధ్యయనం తేల్చి చెప్పింది. స్థానిక వనరులంటే ప్రయోగాలు నిర్వహించగల వైద్యులూ, పరీక్షలు చేయగల సాంకేతికులు, ప్రయోగజంతువులుగా ప్రజలు. మొత్తంగా నిర్వహణ వ్యయం చౌకగా వుండటమే ప్రధానం. బహుళజాతి మందుల కంపెనీ బేయర్ గత ఏడాది 600 మందులపై ప్రయోగాలు నిర్వహించింది. ఇవన్నీ వెనుకబడిన దేశాల్లోనే జరిగాయి. వీటిలో దాదాపు 300 మందుల ప్రయోగాలు భారత్‌లోనే జరిగాయని తెలుస్తున్నది.

ఇంత జరిగినా, భారత ప్రజల ప్రాణాలు బలిపెట్టిసాగించిన ప్రయోగాలు ప్రజలకు అందుబాటులో వుంటాయా అంటే అదీ లేదు. ఈ కంపెనీలు సాగించే ప్రయోగ ఫలితాల మూలంగా ఒక కొత్త మందు ఆవిష్కృతమైతే దానికి అమెరికాలో పేటెంటు హక్కును పొందుతాయి. ప్రపంచ వ్యాపితంగా అమ్ముకుని లాభాలు గడిస్తాయి. భారత కంపెనీ నెట్ ఫార్మా ఒక నెల వాడే 120 టాబ్లెట్ల కాన్సరు మందు నెక్సావర్‌ను రు. 8,800కు అమ్ముతానని కంపల్సరీ లైసెన్సును పొందింది. అంతవరకు ఈ మందుకు విదేశీ కంపెనీ నుండి అనుమతి పొందిన లూపిన్ రు. 25 వేలకు భారత్‌లో అమ్ముతూన్న నెట్ ఫార్మాను (తరువాయి 6వ పేజీలో)

# జె ఏ సి ఆందోళనలు, పోరాటాలు ఆర్థిక డిమాండ్ల వరకే పరిమితం చేయరాదు

**ఐదు** దశాబ్దాలక్రితం మన రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు-తమ డిమాండ్ల సాధనకు ఐక్యవేదికలను ఏర్పాటుచేసుకొని సమిష్టిగా ఎన్నో ఆందోళనలు, పోరాటాలు సాగించాయి. పలు డిమాండ్లు సాధించుకొన్నాయి. కొన్ని వైఫల్యాలు చవిచూశాయి, అనుభవాలు గడించాయి. మొత్తంమీద సమరశీల పోరాటాలు సాగించి బేరమాడేశక్తిని ప్రదర్శించడంపైనే, ఉమ్మడి సమస్యల పరిష్కారం ఆధారపడి వుంటుందని గ్రహించాయి. ఈ సూత్రాన్ని కొంతకాలం పాటించాయి.

రాష్ట్రంలో గడచిన ఐదు దశాబ్దాల కాలంలో, రెండు ఐక్యవేదికలు ఏర్పడి పనిచేశాయి. ఒకటి జెసిఏ. ఇది 1958లో ఏర్పాటైంది, 1971 వరకు పనిచేసింది. అదే సంవత్సరంలో జెసిఏ 56 రోజులపాటు సమ్మె చేసింది. పాలకులు మొండివైఖరిని ప్రదర్శించారు. సమ్మెను అణచివేసేందుకు అరెస్టులు, పోలీసు కాల్పులకు దిగింది. ఎంతో మందిని జైళ్ళల్లో పెట్టింది. కాల్పుల్లో ఇద్దరు ఉద్యోగస్తులు మరణించారు. చివరకు ఏ డిమాండును పరిష్కరించలేదు సరిగదా, కనీసం చర్చలు చేయలేదు. చివరకు నాయకత్వం సమ్మెను విరమించింది. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విడివిడిగానే ఉద్యమాలు సాగించాయి, ఇది 1988 వరకు నడిచింది.

1982లో అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం క్రమంగా ఉద్యోగ, ఉపాధ్యాయ తదితర సంఘాలపట్ల తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శించి, డిమాండ్లను పరిష్కరించ లేదు. వారికివున్న హక్కులను కోతబెట్టింది. విడివిడిగా సాగించిన సమ్మెలను అణచివేసింది. ఈ పరిస్థితులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను పునరాలోచింప చేశాయి. పర్యవసానంగా 1988 చివరి భాగంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికసంఘాలు జెఏసిగా ఐక్యవేదికను ఏర్పాటు చేసుకొన్నాయి. దీనితో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాల మధ్య ఐక్యత ఏర్పడింది. నాడు ఏర్పడిన జెఏసి నేటికీ కొనసాగుతూంది.

1991నుండి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తూన్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు- ముఖ్యంగా, సామాన్య ప్రజ; ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికవర్గాల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. అందువలన వివిధ సంఘాలలోను, సంఘాలమధ్య(జెఏసి) ఐక్యత పెంపొందించుకొని, సంఘటితంగా ఉద్యమాలు సాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఆచరణలో పొందుతున్న అనుభవాలను విశ్లేషించుకొని, ఐక్యతను నిలబెట్టుకొని ఐక్యతాసూత్రాన్ని పాటించాలి. నేటి జెఏసి సాగిస్తున్న దశలవారీ ఉద్యమంలో తెలంగాణ ప్రాంత ఉద్యోగ కార్మిక సంఘాలు పాల్గొనక, వెలుపల వున్నాయి. ఇదొక బలహీనతే.

నేడు జెఏసి దశలవారీ ఉద్యమంలో భాగంగా సెప్టెంబరు 25న జిల్లా, తాలూకా కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలు చేశాయి. అక్టోబరు 3వ వారంలో రిలే నిరాహారదీక్షలు, నవంబరులో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించుతామని ప్రకటించింది. వీటికి ముందు జిల్లాల్లో జెఏసి నాయకులు పర్యటించారు. ఈ సంస్థ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘాలు కూడా భాగస్వాములవుతున్నాయి.

**జెఏసి డిమాండ్లు**

జెఏసి డిమాండ్లు మొత్తం 11. వాటిల్లో కొన్ని ఆర్థికపరమైనవి, విధానపరమైనవి వున్నాయి. ప్రధానమైన వాటిని పరిశీలిస్తే మొదటిది, 10వ పిఆర్‌సి నియామకం- ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అటుఇటుగా వేతన సవరణ సంఘాన్ని ప్రభుత్వం నియమించుతుంటుంది. ఇంతవరకు తొమ్మిది వేతన సవరణ సంఘాల్ని నియమించింది. అయితే వాటి సిఫార్సులలో తలెత్తిన వేతన అసంబద్ధాలను తొలగించేందుకు, అనామలీస్ కమిటీలను నియమించడం, కొన్నిటిని సరిదిద్ది అమలుచేయటం జరుగుతున్నది. తొమ్మిదవ వేతన సంఘ సిఫార్సులలో దొర్లిన అసంబద్ధాలను సరిచేసేందుకు సంఘాన్ని నియమించడంలో ప్రభుత్వం జాప్యంచేసి, ఇటీవల నియమించింది. దీనిని జెఏసి వ్యతిరేకించి, 10వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేస్తున్నది. ఎందుకంటే, తొమ్మిదవ వేతన సంఘ సిఫార్సులను ప్రభుత్వం 1-7-2008 నుండి అమలుచేసింది. 2013కు ఐదు సంవత్సరాలు పూర్తికానున్నందున జెఏసి 10వ పిఆర్‌సిని కోరుతున్నది.

రెండవది, జెఏసి ప్రతిపాదనల మేరకు హెల్త్ కార్డులను జారీచేయాలి-వీటికి సంబంధించి ప్రభుత్వం రెండు ఉత్తర్వులను జారీచేసింది. వీటిల్లో చర్చల్లో అంగీకరించిన అంశాలనుచేర్చలేదు. ఆ మేరకు జీవోలను సవరించి, హెల్త్ కార్డులు జారీచేయవలసివుంది. ఈ సౌలభ్యం అమలులో ఎయిడెడ్, మునిసిపల్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న సిబ్బందిని మరియు గ్రంథాలయోద్యోగులను మినహాయించి వివక్షతను చూపించింది. వీరికీ ఈ పథకం వర్తింపచేయాలని; ఉద్యోగులకు రెండులక్షలు, వారి కుటుంబాలకు మూడు లక్షల వరకు పరిమితి విధించింది. దీనిని మూడులక్షలు, ఐదు లక్షలకు పెంచాలని జెఏసి డిమాండ్ చేస్తున్నది. అంతేకాదు, హెల్త్‌కార్డుల పథకాల నిర్వహణ బాధ్యతను ఆరోగ్యశ్రీ ట్రస్టుకు అప్పగించరాదని; ప్రభుత్వ అధికారుల, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఒక స్వతంత్ర ట్రస్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

మూడవది, కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కంటింజెంట్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, విద్యావలంటీర్ల విధానాలను రద్దుచేసి, వారిని క్రమబద్ధీకరించాలి. ఈ సమస్య పరిష్కారంకోసం చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. అయినా ప్రభుత్వం పెడచెవినబెట్టి, సమస్య పరిష్కారానికి ముందుకు రావడంలేదు. మొక్కుబడి హామీలతో కాలయాపన చేస్తున్నది. ఈ సమస్యను జెఏసి కూడా డిమాండ్లలో చేర్చడం, చర్చలలో ఆర్థిక డిమాండ్లకు ప్రభుత్వం ఆమోదం తెలియచేయడంతో విధానపరమైన యీ డిమాండ్‌కు తగిన ప్రాధాన్యత ప్రభుత్వం ఇవ్వడంలేదు. పర్యవసానంగా ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక వ్యతిరేకమైన యీ విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తున్నది. దీనివలన పైన పేర్కొన్న వారి శ్రమ శక్తిని కారుచౌకగా ప్రభుత్వం, వివిధ యాజమాన్యాలు కొల్లగొడుతున్నాయి. దోపిడీ, పీడనలను యధేచ్ఛగా సాగిస్తున్నాయి. వారి జీవన విధానం అతలాకుతలం అవుతున్నది. యీ విధానాన్ని రద్దుచేసేవరకు జెఏసి పోరాటాలు సాగించడం ఒక కర్తవ్యంగా తీసుకోవాలి.

నాల్గవది, ఖాళీపోస్టులు భర్తీచేయడం-ఇదొక పరిష్కారం చేయని సమస్య. నూతన ఆర్థిక విధానాల అమలువలన కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని సంవత్సరాలుగా ఖాళీపోస్టులను భర్తీచేయడంలేదు. అంతేగాక కంటింజెంట్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాలతో రెగ్యులర్ నియామకాలు చేయడంలేదు. సర్వీస్ కమీషన్ ద్వారా భర్తీచేస్తున్న ఖాళీపోస్టులు, ఆఫీసర్ల స్థాయికి సంబంధించినవే. ఇవి కూడా వాయిదాలపై వాయిదాలు వేయడం, లిటిగేషన్‌కు అవకాశాలు కల్పించి, కోర్టులపాలు చేయడం, విపరీతజాప్యం చేయడం జరుగుతున్నది. విద్యాసంస్థలలో డిఎస్‌సిలు నిర్వహించి ఖాళీపోస్టులను భర్తీచేస్తున్నది. కాని ఇక్కడ కూడా, ప్రకటించిన విధంగా డిఎస్‌సి నిర్వహించదు. వాయిదాలు వేస్తూనే వుంటుంది. అందువలన విద్యావలంటీర్ల నియామకాలు ప్రతి సంవత్సరం తప్పనిసరి చేస్తున్నది. వీళ్ళు ఏభైవేల మంది వరకు పనిచేస్తున్నారు. ఇక, ఎయిడెడ్ విద్యాసంస్థలలో నియామకాలనే నిషేధించింది. విద్యావలంటీర్లనూ నియమించడంలేదు. వాటి మానాన వాటిని విడిచిపెట్టింది.

జనాభా సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్నది. ఆ మేరకు ప్రభుత్వం పౌరసేవలను అందుబాటులోకి తేవాలి. అందుకు ఖాళీపోస్టులను భర్తీచేయడమేగాక పెరుగుతున్న జనాభా ప్రాతిపదికగా కొత్త పోస్టులను మంజూరుచేసి, భర్తీచేయవలసివుంది. ఇందులో ప్రభుత్వం దేనినీ పాటించక పనిభారం పెంచుతున్నది. ఈవిధంగా వ్యవహరించడం దుర్మార్గం. ఈ ప్రజావ్యతిరేక ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వ్యతిరేక విధానాలపైన జెఏసి తగిన ఆందోళనలు, పోరాటాలు చేపట్టకపోవడం శోచనీయం! అందువలన, ఖాళీపోస్టుల భర్తీ డిమాండ్ పరిష్కారం కావటంలేదు, కొనసాగుతూనేవున్నది.

మరికొన్ని ఉపాధ్యాయ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వం ముందు జెఏసి ప్రతిపాదించింది. అవి : ఎయిడెడ్ విద్యాసంస్థలలో పనిచేసిన సిబ్బందికి గ్రాంటు ఇన్ ఎయిడ్‌ను ప్రభుత్వం అనుమతించిన తేదీకి ముందు చేసిన సర్వీస్‌కు కొన్ని సంవత్సరాల క్రితం నోషనల్ యింక్రిమెంట్లను అనుమతించింది. తర్వాత కొన్ని వేతన సవరణ సంఘాలు చేసిన సిఫార్సుల ద్వారా వారి వేతనాలు పెరిగాయి. ఈ విధంగా ఇవ్వడం సరి కాదని పాలకులకు జ్ఞానోదయ మైంది. ఇచ్చిన వాటిని రికవరీ చేయాలని 2005లో 1వ చట్టాన్ని చేసి అమలు చేస్తున్నది. దీనివలన కొన్ని వేల రూపాయలు ప్రభుత్వానికి తిరిగి చెల్లించవలసి వస్తున్నది. అంతేగాక ఐక్యవేదిక ఉద్యమం ద్వారా 1983లో భాషా పండితులు మొదటి గ్రేడ్ అర్హత కలిగి, రెండవ గ్రేడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారికి వారి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, మొదటి గ్రేడ్ స్కేలుకు ప్రభుత్వం అనుమించింది. ఇటువంటి వారికి కల్పించిన సదుపాయాన్ని రద్దుచేస్తూ 2005లో 37వ చట్టాన్ని చేసింది. వీరికీ రికవరీ చేస్తున్నది. దీని వలన వేలాది రూపాయలను ప్రతిఒక్కరు కోల్పోతున్నారు. 2008లో 13 రోజులపాటు జోక్టో సమ్మె చేసినపుడు నాటి ముఖ్యమంత్రి చట్టంచేసిన తేదీ నుండి అమలు చేసి, రికవరీ లేకుండా చేస్తానని ఒప్పందం ఇచ్చారు. నేటివరకు దానిని అమలు చేయలేదు. తిన్న సొమ్మును తిరిగి రాబట్టు కోవడం ప్రభుత్వ దివాళాకోరుతనం తప్ప మరొకటికాదు.

సమ్మె హక్కును హరించడానికి పాలకులు విశ్వప్రయత్నం చేస్తున్న విషయం తెలియంది కాదు. ఇందులో కోర్టులూ అత్యుత్సాహం ప్రదర్శించుతున్నాయి. తెలంగాణ ఉద్యోగ సంఘాలు 2011లో సమ్మెసాగించిన సందర్భంగా 177 జీవోను జారీ చేసింది, ఆంక్షలు విధించింది, తర్వాత దాని అమలు నిలిపివేసింది. కానీ ఆ జీవోను మాత్రం రద్దుచేయలేదు. దానిని కొనసాగించడం అంటే సమ్మె హక్కును హరించడమే అవుతుంది. దీనిని రద్దు చేయాలని జెఏసి డిమాండ్ చేస్తూంది, ఇదొక ప్రధానమైన డిమాండ్!

ఆర్థిక డిమాండ్ల పరిష్కారానికే జెఏసి పరిమితమైతే, విధానపరమైన డిమాండ్లు ప్రక్కమార్గం పడతాయి. దాదాపు మూడున్నర లక్షల మందికి సంబంధించిన యీ డిమాండ్లపట్ల జెఏసి ఉదాసీనవైఖరిని చూపరాదు.

దశలవారి ఉద్యమాలు కూడా విజయవంతం కావాలన్నా, ఆర్థిక, విధానపరమైన డిమాండ్లు పరిష్కారం కావాలన్నా ప్రజలపట్ల, వారి సమస్యల పరిష్కారంపట్ల, ప్రజాతంత్ర ఉద్యమాలపట్ల సానుకూల వైఖరిని పెంపొందించుకోవలసి వున్నది. ఈ సంబంధాలు నిత్యం కొనసాగాలి. వారి విశ్వాసాన్ని చూరగొనే విధంగా తమ సంఘాల నిర్మాణ ఉద్యమ పనిపద్ధతులను అభివృద్ధి పరచుకొని ఐక్యఉద్యమ కార్యాచరణ పటిష్టపరచుకోవడమే మార్గం. ఈ కర్తవ్య నిర్వహణకోసం అంకితం కావాలి.

# ఉత్తర ప్రదేశ్ అఖిలేష్‌యాదవ్ ప్రభుత్వపు 'దళిత వ్యతిరేక' అడుగులు

**ఉత్తర** ప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్ నాయకత్వాన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అదొక కార్యక్రమాన్ని చేపట్టింది. అదేమిటంటే మాయావతి నాయకత్వంలో బహుజన్ సమాజ్‌పార్టీ (బిఎస్‌పి) ప్రభుత్వం దళితుల కొరకు అమలు చేసిన కొన్ని ప్రదర్శనాత్మక, మరి కొన్ని అవసరమైన పథకాలను మార్పు వేయటం. అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే అంబేద్కర్ గ్రామ యోజనతో సహా అనేక పథకాల పేర్లను మార్చివేసింది. అంతేకాక, ఆ పథకాలవల్ల లబ్ధి చేకూర్చాలని లక్షించిన లబ్ధిదారులను కూడా మార్చి వేసింది. ప్రభుత్వం చేపట్టే పనులను కాంట్రాక్టుకిచ్చే టప్పుడు అమలు చేస్తున్న రిజర్వేషను పద్ధతిని కూడా తొలగించింది. ఇంతేకాక దళిత నాయకుల, చారిత్రక వ్యక్తుల పేర్లను పెట్టిన జిల్లాలకు తిరిగి పాతపేర్లను ఖరారు చేసింది. భవిష్యత్తులో ఇలాంటి చర్యలనే అఖిలేష్ ప్రభుత్వం ఇంకా తీసుకోవచ్చు.

అఖిలేష్ ప్రభుత్వపు ఈ చర్యల అర్థమేమిటి? ఉత్తరప్రదేశ్‌లోని పెట్టుబడిదారీ రాజనీతి సందర్భంగా దీనినెలా అర్థం చేసుకోవాలి?

ఇది గ్రామీణ మధ్యకులాలలోని భూస్వామ్య (కులక్కుల) ధనికరైతుల ద్వారా దళిత కులాల పైనా, ప్రత్యేకించి దళితులలోని పెట్టుబడిదారులపైనా సాగుతున్న దాడి వ్యక్తీకరణే !

1993లో ఎస్‌పి, బిఎస్‌పిల సంయుక్త ప్రభుత్వమేర్పడినప్పుడు ఈ మైత్రి అన్నిస్థాయిల్లోనూ, బలంగా నెలకొనాలని పైనుండి భావించారు. దళిత, వెనుకబడిన కులాలవారు మత-వర్గ వ్యవస్థతో పీడించ బడుతున్నారు. వీరిద్దరూ కలిస్తే ఉత్తరప్రదేశ్ జనాభాలో నాలుగింట మూడవంతులుగా వుంటారు. వీరందరూ ఒక్కటైతే సవర్ణులెలా నిలవగలరు, బిజెపిలోకి పోతారు.

కానీ రెండేళ్ళు తిరగకుండానే ఈ బంధం విడిపోయింది. అనేక మౌలిక సమస్యలమీద రెండు పార్టీల మధ్యనా తగాయిదాలు సాగాయి. వాస్తవానికి మధ్యకులాలలోని ఉన్నతశ్రేణి భూస్వాములు, ధనిక రైతులనుండి కులపరమైన అణచివేతకు గురికావటం లేదు. అంతేగాక, మధ్యకులాలకు ఎదురౌతున్న కుల వివక్షకూ దళిత కులాల పేదలు గురౌతున్న వివక్షకూ పోలికలేదు. ఇంతేకాదు. గ్రామాలలో దళిత శ్రామికులను దోపిడి చేస్తున్నవారు దళిత శ్రామికులతో సంబంధాలు నెరపటం చెడ్డవిషయంగా చూస్తున్నారు. ఏదో విధంగా వారిని తమ అదుపులో వుంచుకోవాలని చూస్తున్నారు; వారిశ్రమను కొరుకున్నట్లు దోచుకోవాలని చూస్తున్నారు. దీనికోసమే వారు దళిత శ్రామికులతో కుల భేద భావాలను ముందుకు తెస్తున్నారు. దళిత శ్రామికులపట్ల సవర్ణులెలా వ్యవహరించేవారో అదే తీరులో వారు కూడా నడుస్తున్నారు. దీనిలో విజయంకోసం వారు తమ కులంలోని పేదలను కూడా తమ వెనుక సమీకరించ కొంటున్నారు.

మరోవైపున దళితులలోకూడా తమపై సాగుతున్న కులవివక్షతను ప్రతిఘటించే భావనలు పెరుగుతున్నాయి; దళితులలో కూడా పెట్టుబడిదారీవర్గమూ, మధ్యతరగతి వర్గమూ ఏర్పడ్డాయి. ఇవి బిఎస్‌పిలో చేరి దళితుల ప్రతిఘటనకు నాయకత్వమందిస్తున్నాయి. బిఎస్‌పి నాయకత్వంలో వున్న పెట్టుబడిదారీ, మధ్యతరగతి వర్గాల నాయకులు దళిత శ్రామికులను తమవెనుక సమీకరించుకొని, తమ వర్గస్థితిని మెరుగుపరచుకునే, →

→ ఆ విధంగా కుల వివక్షత నుండి తాము బయటపడే లక్ష్యాన్ని మాత్రమే కలిగి వున్నారు. దళిత శ్రామికుల విముక్తి వారి లక్ష్యం ఎంత మాత్రమూ కాదు.

అయితే దళిత శ్రామికులు బిఎస్‌పి జండా నీడన చేరటం మధ్యకులాలకు చెందిన భూస్వాములకు ఆందోళన కలిగిస్తున్నది. అందువల్ల బిఎస్‌పిని వ్యతిరేకిస్తున్నారు. ఇది దళిత పెట్టుబడిదారీ, మధ్యతరగతి వర్గాలకే పరిమితమైవుంటే ఏదోరకంగా బేరసారాలు సాగించగలిగేవారు. కానీ విషయం దళిత శ్రామికులకు సంబంధించింది గనుక, పరిస్థితి ఘర్షణ దాకా వెళ్లక తప్పదు. దళిత శ్రామికులను వారి హద్దులలో వుంచాల్సిన అవసరం ఏర్పడింది. అప్పుడే వారిపై నిర్బంధ దోపిడీ సాగించవచ్చు. అఖిలేష్ ప్రభుత్వ "దళిత వ్యతిరేక" నిర్ణయాల నిజమైన అర్థమిదే.

*(ఉత్తరాఖండ్ నుండి వెలువడుతున్న పక్ష పత్రిక "నాగరిక్-అధికారోంకో సమర్పిత్" 2012 ఆగస్టు 16 సంచిక నుండి అనువాదం)*

**ఔషధ ప్రయోగాలు...** (5వ పేజీ తరువాయి)

అనుమతించవద్దనీ, తాను రు. 7,700 కు అమ్ముతాననీ వివాదానికి దిగింది. కాగా అసలు కంపెనీ బేయర్ దీనిని ఇతర దేశాలలో 8 లక్షల 88 వేల రూపాయలకు అమ్ముతున్నది. మందుల కంపెనీల నిలువు దోపిడీకిది మచ్చుతునక. 2006 నుండి 2010 వరకూ ఐదేళ్ళకాలంలో రాన్‌బాక్సీ అన్న భారత మందుల కంపెనీ (దీనిని దాయిచీ అన్న జపాను కంపెనీ కొనివేసింది) ఔషధ ప్రయోగాలలో అమెరికాలో 24 పేటెంట్లు పొందింది. అలాగే ఇజ్రాయిల్‌కు చెందిన తేవాఫార్మసుటికల్స్ 11 పేటెంట్లు అమెరికాలో పొందింది. అంటే భారత ప్రజల ప్రాణాలు బలిపెట్టి పొందిన ఫలితాన్ని భారత ప్రజలు అధికమూల్యం చెల్లించి తావే కొనుక్కోవాలి.

పేటెంట్లు లేవు. మొత్తం ప్రయోగాలలో చౌకైన, మనుషులపై ప్రయోగించే భాగాలనే పొరుగు సేవలుగా భారత్‌లో నిర్వహించి, ప్రయోగమంతా తామే చేసినట్లు విదేశీ కంపెనీలు చూపి తమ దేశంలో పేటెంటు పొందుతుండటమే దీనికి కారణం.

కొత్త మందులను కనుగొన్నప్పుడు వాటిని మనుషులపై ప్రయోగించి చూడాల్సిందే. అప్పుడు మాత్రమే దాని ఫలితం నిర్ధారితమౌతుంది. అలాంటి ప్రయోగ సమయంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారికి సకల రక్షణలూ కల్పించాలి. స్వచ్ఛందంగా ముందుకొచ్చారుగనుక ప్రయోగ ఫలితాలు ప్రజలందరికీ అందుబాటులో వుండాలి. కొందరి దారిదోపిడీకి సాధనం కారాదు. ఈ దిశగా చట్టాలు రూపొందించి, అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. మందుల ప్రయోగాలతో వస్తున్న విదేశీ మారక ద్రవ్యాన్ని చూసి మురిసిపోతూ, తన బాధ్యతను వదలివేస్తున్న భారత ప్రభుత్వాన్ని నిలదీయాలి.

మందుల ప్రయోగాలలో మరణించిన, ఆరోగ్యం దెబ్బతిన్న వారికి నష్టపరిహారం చెల్లింపును లెక్కించటానికి మార్గదర్శకాల ముసాయిదాను డిసిజిఐ ఆగస్టు నెల మొదటివారంలో విడుదల చేసింది. వ్యక్తి ఆదాయం, విద్యాస్థాయి, దుష్ఫలితాల తీవ్రత పరిగణించి నష్టపరిహారం నిర్ణయించాలని ముసాయిదా సూచించింది. చర్చలూ, సూచనలూ, సవరణల తర్వాత అసలు మార్గదర్శకాలు ఎలా వుండబోతాయన్న సంగతి అలా వుంచితే, నష్టపరిహార నిర్ణయించేది నీతి నియమాల కమిటీలు. ఇవి కంపెనీలకనుసన్నలలో నడుస్తున్నాయని బహిరంగంగా ప్రకటించిన డిసిజిఐ, వాటికే నష్టపరిహార నిర్ణయాధికారాన్ని అప్పగించాలనటం భారత పాలకుల నయవంచనకు మరో తార్కాణం.

# నివాస స్థలాలకోసం సాగుతున్నఆందోళనకు ప్రజాతంత్రవాదుల సంఘీభావం



గుడిశెవాసులకు సంఘీభావం ప్రకటిస్తున్న డా॥ కొల్లా రాజమోహన్; చెరుకూరి సత్యనారాయణ, జె. నరసింహారావు, ఎస్. వెంకటేశ్వరరెడ్డి తదితరులు

**రెంటచింతల, 5-9-12:**

గుంటూరు జిల్లా - మండల కేంద్రవైన రెంటచింతలలో నివాసస్థలాలకోసం నిరుపేద, దళిత, ప్రజానీకం గత కొద్దికాలంగా నిరంతరాయ ఆందోళనా క్రమంలో ఉన్నారు.

అప్పటిదాకా పెత్తందార్ల చేతుల్లో ఉన్న సర్వేనెంబర్ 300 భూమిలో తమకు నివేశన స్థలాలు కేటాయించాలని ప్రజలు డిమాండ్‌చేస్తూ ఆందోళన సాగించిన ఫలితంగా, ప్రభుత్వం మేల్కొని పెత్తందార్ల చేతుల్లోనున్న భూమిని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. ఆగస్టు 26వ తేదీన గుడిశవాసులు సదస్సు జరుపకోనుండగా, అంతకు ముందు రోజు రాత్రే ప్రభుత్వ, పోలీసులు నిరుపేదల గుడిశలను తొలగించి వేశారు.

ఈ నేపథ్యంలో, 5-9-12న గుడిశవాసులంతా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించి తాశీల్దారుకు మెమోరాండం అందజేశారు.

ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది, గుంటూరుజిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ; నల్లమడ రైతురక్షణ కమిటి నాయకులు డా॥ కొల్లా రాజమోహన్; ప్రముఖ న్యాయవాదులు జె. నరసింహారావు (గుంటూరు) శానంపూడి వెంకటేశ్వరరెడ్డి(గురజాల), నాగరాజు (ఇంజనీర్, నిజాంపట్నం) తదితరులు హాజరై ఆందోళనలో వున్న ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించారు. అధికారులను కలసి దళిత, పేద ప్రజానీకానికి ఇళ్ళ స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం, చట్టాలు ప్రజలకు కల్పించిన హక్కులను బాధ్యతగా ప్రభుత్వం, సంబంధిత అధికారులు అమలు జరపనప్పుడు, ప్రజలే వాటిని అమలుజరుపుకుంటారని, ఇది ఏమాత్రం చట్టవ్యతిరేకం, రాజ్యాంగ వ్యతిరేకంకాదని ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. ప్రభుత్వ వ్యవస్థను గౌరవించి, న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించమని కోరితే, నిరాకరించినపుడు ప్రజలు తప్పనిసరిగా మరో ప్రత్యామ్నాయం ఎంచుకుంటారని అందుకు, ప్రస్తుత ఈ వ్యవస్థదే బాధ్యత అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాసంఘాల నేతలతోపాటు, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రనాయకులు కా॥డివిఎన్‌స్వామి; సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి; రైతుకూలీసంఘం జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు కా॥కోటేశ్వరరావు, కా॥నాగేశ్వరరావు; పాలకుర్తి సత్తెయ్య, సురభి అమరలింగం తదితరులు పాల్గొన్నారు.

**నర్సరావుపేట, 10-9-12:**

నర్సరావుపేట రెవిన్యూ డివిజన్ పరిధిలోని రెంటచింతల గ్రామ నిరుపేదల ఇళ్ళస్థలాల సమస్య పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ గుడిశవాసులు నర్సరావుపేట తరలివెళ్ళి ఆందోళన నిర్వహించారు. ఆర్‌డిఓకు మెమోరాండం అందచేశారు.

ప్రజల పోరాటంద్వారా వెలికితీసిన సర్వేనెంబరు 300 భూమిలో పేదప్రజలకు ఇళ్ళస్థలాలు ఇవ్వాలని; ఎన్నో సం॥లుగా పెత్తందారుల ఆధీనంలో ఉండగా మిన్నకున్న ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకొని, అందులోనున్న పేదల గుడిశలను తొలగించటాన్ని ఈ సందర్భంగా పలు ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. రైతుకూలీసంఘం, ఏఐఎఫ్‌టియు(న్యూ), సిపిఐ(ఎం.ఎల్) తదితర సంస్థల నాయకులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ✡

# రజకుల సమస్యల పరిష్కారానికై డిమాండ్

**రాయదుర్గం, 30-8-12:**

రజక వృత్తిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥సి. పెద్దన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని చెన్నవీరస్వామి దేవాలయం వద్దనుండి వినాయక సర్కిల్ మీదుగా రజకులు పెద్ద సంఖ్యలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం కా॥పెద్దన్న వారి నుద్దేశించి ప్రసంగించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, రాష్ట్రంలో రజకవృత్తిపై ఆధారపడి జీవిస్తూ, అనేక వివక్షతలకు గురౌతూ జీవిస్తున్న 40 లక్షలమంది రజకవృత్తిదారులకు నేటికీ పక్కాగృహాలు, బియ్యంకార్డులు, ఓటరు గుర్తింపు కార్డులుకూడా సక్రమంగా అంద జేయలేదని, అధికారులు వెనువెంటనే వీరి సమస్యలను పరిష్కరించాలని కా॥సి. పెద్దన్న డిమాండ్ చేశారు. వివిధ కాలనీలకు చెందిన రజకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥బి. తిమ్మారెడ్డి; రజక సంఘం నాయకులు గాది లింగప్ప, ఎర్రిస్వామి, నాగరాజు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✡

# కృష్ణాడెల్టా సాగునీటి సమస్య పరిష్కారానికై ధర్నా

**చల్లపల్లి, 27-8-12 :**

కృష్ణాడెల్టా పంటపొలాలకు సాగునీరు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా, మండల కేంద్రమైన చల్లపల్లిలో రైతులు ధర్నా నిర్వహించారు.

రైతుకూలీసంఘం చల్లపల్లి ప్రాంత కార్యదర్శి కా॥ఈపూరి రాంబాబు ధర్నాలో ప్రసంగిస్తూ కృష్ణాడెల్టా లోని 13 లక్షల 80వేల ఎకరాలలో సగం భూములు పైగా సాగునీటి కొరత కారణంగా నాట్లు వేయలేదన్నారు. సంఘంజిల్లా కోశాధికారి కా॥ తలశిల లీలామనోహర్ మాట్లాడుతూ, వేసిన నాట్లు ఎండిపోకుండా చూసుకోవాల్సిన దుస్థితిలో రైతులు వున్నారనీ, ఈస్టర్న్ కెనాల్ ఆధునీకరణ పేరుతో గత సంవత్సరమూ సాగునీరందక నష్టపోయారని చెప్పారు. సంఘం జిల్లా నాయకులు కా॥ జగన్ మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చి సాగునీరువదలాల్సివుండగా, విద్యుత్ అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత నివ్వటమే సమస్యకు కారణమనీ, రైతులంతా దీనిపై సమైక్య పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ధర్నాలో సంఘం నాయకులు కా॥ అంజమ్మ, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని తాసీల్దారుకు అందచేశారు. ధర్నాకు ముందుగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో ప్రచార బృందాలుగా పరిసర గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ✡

# ప్రజాసమస్యల పరిష్కారానికై ఆందోళన

**రాయదుర్గం, 3-9-12:**

రాయదుర్గం రూరల్‌మండలం 74 ఉదేగోళం గ్రామ మహిళలు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో పెద్దఎత్తున కదలి మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించి, తమ తక్షణ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ తహసిల్‌దార్‌కు, ఎంపిడీఓకు మెమోరాండం అందజేశారు. బహిరంగా మలవిసర్జనను సాంఘిక అపచారంగా, నేరంగా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేస్తూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సబ్సిడీ అందజేస్తున్నామని ఘనంగా ప్రకటించుకోవటమేగానీ, ఆచరణలో మొండిచేయి చూపుతున్నదని ప్రజలు ఎండగట్టారు. అరాకొరాగా ప్రభుత్వం అందజేసే రు.2750/- మరుగుదొడ్ల నిర్మాణానికి ఏమాత్రమూ సరిపోవని, కేంద్రప్రభుత్వం రు. 9100/- కేటాయించిన విషయానికి ప్రచారం కల్పించకుండా ప్రభుత్వాధికారులు కాలం వెళ్ళదీస్తున్నారని వారు విమర్శించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి 74ఉదేగోళం గ్రామ ఎస్సీ, బీసీ కాలనీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించి, తమ సమస్యను పరిష్కరించాలని వారంతా డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥సి. పెద్దన్న ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారినుద్దేశించి మాట్లాడుతూ పోరాడకుండా ఏ చిన్న సమస్యనైనా పరిష్కరించగల స్థితిలో ప్రభుత్వమూ, ప్రభుత్వ యంత్రాంగమూ లేవనే విషయాన్ని గుర్తించి, ఆందోళన ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥బి. తిమ్మారెడ్డి; ఇంకా రోడ్డుమార్జిన్ వ్యాపారుల అసోసియేషన్ నాయకులు నరసింహులు, రత్నమ్మ, మారెక్క, గంగమ్మ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**కణేకల్లు, 10-9-12 :**

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు, వ్యక్తిగత మరుగుదొడ్లు, కార్మికుల ఇళ్ళస్థలాలు తదితర సమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో కొత్తపల్లి, ఆదిగానిపల్లి, రచ్చుమర్రి, మాళ్యం తదితర గ్రామాలనుండి హాజరైన ప్రజానీకం స్థానిక చిక్కణ్ణేశ్వర దేవాలయం వద్దనుండి ఎర్రజెండాలు చేబూని నినాదాలుచేస్తూ మెయిన్‌రోడ్డు మీదుగా తాసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు.

తాసీల్దారు కార్యాలయంవద్ద జరిగిన ధర్నా నుద్దేశించి ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రఅధ్యక్షులు కా॥సి. పెద్దన్న మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలే లోపభూయిష్టంగా ఉండగా, వాటిని సాధించుకోవాలంటే కూడా ప్రజలు రోడ్లు ఎక్కకుండా సాధ్యంకావటం లేదన్నారు. జిల్లా రైతులకు కేటాయించిన ఇనపుట్ సబ్సిడీ కోసం కూడా రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరగాల్సి వస్తున్నదని రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ తిమ్మారెడ్డి పేర్కొన్నారు. ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు ఇళ్ళస్థలాలు మంజూరుచేయాలని, ఆటోయూనియన్ జిల్లా అధ్యక్షులు రహంతుల్లా డిమాండ్ చేశారు. ✡

# ఫోటోగ్రాఫర్ల, చిరువ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న 'మంగినపూడి బీచ్‌లో నిషేదాజ్ఞలు' ఎత్తివేయాలని నిరవధిక ఆందోళన



బందరులో ఫోటోగ్రాఫర్లు, చిరువ్యాపారుల ధర్నా

**బందరు, సెప్టెంబరు 2012 :**

గత మే నెలలో మంగినపూడిబీచ్‌లో సముద్ర స్నానంచేస్తున్న ముగ్గురు యువకులు వేర్వేరు సందర్భాల్లో మృతిచెందటాన్ని సాకుగా తీసుకొని ప్రభుత్వాధికార్లు బీచ్‌కు సందర్శకుల రాకను నిషేధించారు.

దీనితో, బీచ్‌కు సందర్శకుల రాకపై ఆధారపడిన చిరువ్యాపారులు, ఫోటోగ్రాఫర్లు తదితర 200 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయి, రోడ్డున బడ్డాయి. వీరంతా ఏఐఎఫ్‌టియు(న్యూ)అనుబంధ 'మంగినపూడి బీచ్ ఫోటోగ్రాఫర్స్ లేబర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో 'బీచ్‌కు సందర్శకుల రాకపోకలను పునరుద్ధరించి తమ జీవనోపాధికి విఘాతం కలగకుండా చూడాలని' నిరవధిక ఆందోళన చేపట్టారు. ధర్నా, రాస్తారోకో ప్రదర్శనలతో పాటు, మంగినపూడి బీచ్ ముఖద్వారం వద్ద రిలేనిరాహార దీక్షా శిబిరాన్ని 12 రోజులపాటు కొనసాగించారు. బందరు పట్టణంలోని తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్, బిజెపి, లోక్‌సత్తాలతో సహా సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం.ఎల్) పార్టీలు వీరి న్యాయమైన ఆందోళనకు మద్దతుగా నిలిచాయి. ఆందోళనా కార్యక్రమాలలో ఫోటోగ్రాఫర్లు, చిరువ్యాపారులతో కలిసి పాల్గొన్నారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర), నవయువసమాఖ్య, స్త్రీవిముక్తి సంఘటన, ఎరుకుల సంఘం మరియు అనేక దళిత, ప్రజాసంఘాలు వీరి న్యాయమైన ఆందోళనలో క్రియాశీలకంగా పాల్గొన్నాయి. పలు దఫాలుగా వివిధ దొంతరల ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తులు చేశారు. అఖిలపక్షం సమావేశం జరిపి బీచ్‌లో నిషేధాన్ని ఎత్తివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వినాయకచవితి విగ్రహాల నిమజ్జనాలను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం మంగినపూడిబీచ్‌లో పాక్షికంగా నిషేధాన్ని సడలించింది. పలు ఆందోళనల పిదప కూడా ప్రభుత్వం బీచ్‌లో నిషేధాన్ని సంపూర్ణంగా ఎత్తివేయక పోవటంపై అఖిలపక్షపార్టీలు, ప్రజాసంఘాలన్నీ తీవ్ర నిరసన వ్యక్తంచేయటంతోపాటు రాబోయే రోజులలో ప్రభుత్వ నిషేదాన్ని ధిక్కరించి సామూహికంగా సముద్ర స్నానాలు చేయాలనే కార్యక్రమాలను రూపొందించు కున్నారు- వీరి న్యాయమైన ఆందోళన కొనసాగుతున్నది.

దాదాపుగా 20రోజులపాటు నిరవధికంగా జరిగిన ఈ ఆందోళనలో మంగినపూడి బీచ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు నాగేంద్రరెడ్డి, బాలాజీ, ఇతర కార్యకర్తలతోపాటు, చిరువ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి యద్దనపూడి సోని, ఎఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు ముచ్చు సుధాకర్; రైతుకూలీసంఘం నాయకులు కా॥పామర్తి అంజమ్మ, ఈపూరి రాంబాబు; స్త్రీవిముక్తి సంఘటన నాయకులు నాంచారమ్మ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✡

***డీజిల్ ధరల...*** (చివరి పేజీ నుండి)

డీజిల్ ఛార్జీల పెంపును ఆసరా చేసుకొని ప్రయాణీకుల ఛార్జీలను పెద్దఎత్తున పెంపుచేస్తూ ఆర్‌టిసి నిర్ణయించటాన్ని వ్యతిరేకిస్తూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో స్థానిక జానపాడు రోడ్డులోని కార్యాలయం వద్ద నుండి తహసిల్‌దారు కార్యాలయం వరకు 24-9-12న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు ప్రజలపై రోజురోజుకూ పెనుభారాలను మోపుతున్న పాలకుల విధానాలపై సంఘటిత ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని, ప్రభుత్వాల మెడలువంచి ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కుతీసుకొనే వైపుగా రాష్ట్రవ్యాపిత మిలిటెంట్ పోరాటాలు నిర్వహించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర), స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు ఇంకా కా॥ సత్యనారాయణ, జానీబాషా, ఏడుకొండలు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✡

పిడుగురాళ్ళలో బంద్



Read ! Subscribe!!




English Organ of
Central Committee of CPI (ML)

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# డీజిల్ ధరల పెంపుదల-వంటగ్యాస్ సరఫరాలో కోత-చిల్లర వర్తకంలో ఎఫ్‌డిఐ అనుమతి ఆర్‌టిసి ఛార్జీల పెంపు తదితర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనాందోళనలు

**విజయనగరం, 14-9-12 :**

కేంద్రప్రభుత్వం మున్నెన్నటికంటే తీవ్రంగా ఒకేసారి డీజిల్ లీటర్ ఒక్కంటిపై 6 రూ॥ పెంచటాన్ని వ్యతిరేకిస్తూ ఎఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ జిల్లా ఆటోవర్కర్స్ యూనియన్ నాయకత్వంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పెంచిన డీజిల్ ధరలను వెనక్కు తీసుకోవాలని, పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నుల భారాన్ని తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో అన్ని వాహనాలూ నిలిచిపోయాయి.

ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యునియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావులు మాట్లాడుతూ డీజిల్ ధరల పెంపుతో ప్రజల రవాణాపై పెనుభారం పడుతున్నదని, సరఫరా ధరలు పెరగటంతో నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగిపోయి సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరమౌతున్నదన్నారు. పెరిగిన డీజిల్ ధరల కనుగుణంగా ప్రయాణీకులపై భారం మోపలేక, మోపకుంటే తాము ఆ భారం భరించలేక ఆటోడ్రైవర్లు, ఆటోలను నడపలేని స్థితికి నెట్టబడుతున్నారని, ప్రభుత్వం వెంటనే తన ప్రజా వ్యతిరేక చర్యలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఆటోయూనియన్ నాయకులు ఎం. సన్యాసిరావు, బి. సన్యాసిరావు మరియు పెద్ద సంఖ్యలో ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

**గుంటూరు, 14-9-12 :**

ప్రజలపై మరింత భారాన్ని మోపుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఎఐఎఫ్‌టియు(న్యూ) 'గుంటూరు మిర్చియార్డు ఆటో వర్కర్స్ యూనియన్' మరియు 'మిర్చియార్డు బల్లరిక్షా కార్మికుల యూనియన్'ల ఆధ్వర్యంలో స్థానిక పల్నాడుబస్టాండు సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు.

ఆటో వర్కర్స్ యునియన్ గౌరవాధ్యక్షులు కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఈ సందర్భాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పాలకులు పేదల సంక్షేమాన్ని కాకుండా, ఆయిల్ కంపెనీల ప్రయోజనాలే పరమావధిగా నిర్ణయాలు చేస్తున్నారనీ, డీజిల్ ధర పెంపుతో అన్నింటి ధరలూ పెరిగిపోయి సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం 'పెనంమీద నుండి పొయ్యిలో పడ్డట్లయింద'ని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రాగం అప్పారావు, చెన్నయ్య, మురళి; మిర్చియార్డు ఆటోరిక్షా కార్మిక యూనియన్ కార్యదర్శి కా॥ బలరాంరెడ్డి, ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం డీజిల్ ధరలను పెంచటాన్ని ఆసరాగా తీసుకొని, డీజిల్ ధర పెరిగినదానికి నాలుగు రెట్లు తాను వడ్డిస్తూ రాష్ట్రప్రభుత్వం ఆర్‌టిసి ప్రయాణీకులపై ఛార్జీల పెంపు భారాన్ని మోపింది. దీనిని నిరసిస్తూ, ప్రభుత్వాల దారిదోపిడీ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వంటగ్యాస్ సిలిండర్ల సరఫరాపై ఆంక్షలను రద్దుచేయాలని, కిరాణారంగంలో ఎఫ్‌డిఐ ప్రవేశాన్ని నిరోధించాలని డిమాండ్‌చేస్తూ 24-9-12న స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో సిపిఐ(ఎం.ఎల్) ఆధ్వర్యంలో రాస్తారోకో జరిపారు-వాహనాలు పెద్దఎత్తున ఆగిపోయాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం.ఎల్), ఎఐఎఫ్‌టియు(న్యూ), ఎన్.వై.యస్. సంఘాల ప్రతినిధులు పాల్గొని నాయకత్వం వహించారు.

**రెంటచింతల, 15-9-12 :**

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. మాచర్ల-గుంటూరు రహదారికి ఇరువైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలచిపోయాయి.

రాస్తారోకో సందర్భంగా రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో పంటలు లేక పనులు లేక ప్రజలు కరువుతో అల్లాడుతుంటే, దీని గురించి పట్టించుకోని పాలకులు ప్రజలపై మరిన్ని భారాలు వేయటం దారుణమన్నారు. సీనియర్ కమ్యూనిస్టు కా॥ సురభి అమరలింగం మాట్లాడుతూ వంటగ్యాస్ సరఫరా కోతలను నిరసించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో వరప్రసాదు, సత్తయ్య, కొండలు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

## ప్రజావ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ 'భారత బంద్'

*(డీజిల్ ధరపెంపు, వంటగ్యాస్ సిలిండర్ల కుదింపు, చిల్లర వర్తకంలోకి,విమానయానరంగం, ప్రసార మాధ్యమాలలోకి ఎఫ్‌డిఐని అనుమతించటంవంటి కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా* ***సిపిఐ(ఎం.ఎల్), ఇతర వామపక్షాలు, వివిధ ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు 20-9-12న దేశవ్యాపితంగా బందు జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సిపిఐ(ఎం.ఎల్) శ్రేణులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర), ఎఐఎఫ్‌టియు(న్యూ) సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ బంద్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.*** *ఊపిరి సలుపుకోనివ్వని ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యల దాడిపట్ల ప్రజానిరసన నానాటికీ తీవ్రమౌతుండటం గమనించాల్సిన అంశం. బందు కార్యక్రమానికి సంబంధించి అందిన మేరకు రిపోర్టులను ప్రచురిస్తున్నాం*

*-సంపాదకుడు)*

**గుంటూరు:**

సిపిఐ(ఎం.ఎల్) ఆధ్వర్యంలో బంద్‌పిలుపులో భాగంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టి వాహన రాకపోకలను నిలిపివేశారు. బందుకు సహకరించవలసిందిగా ప్రజలకు పిలుపునివ్వటంతో పాటు స్థానికంగా వివిధ కూడళ్ళవద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్), ఏఐఎఫ్‌టియు(న్యూ) మరియు మిర్చియార్డు ఆటోవర్కర్స్ యూనియన్, మిర్చి యార్డు బల్లరిక్షా కార్మికసంఘం, వైజాగ్ స్టీల్స్ కార్మిక యూనియన్ నాయకులు, యువకులు, కార్మికులు పాల్గొన్నారు.

**విజయవాడ :**

బంద్ పిలుపులో భాగంగా సిపిఐ(ఎం.ఎల్)తో పాటుగా ఇతర వామపక్ష పార్టీలు స్థానిక లెనిన్‌సెంటర్‌కు చేరుకోవటంతోనే మూడవ టౌన్ పోలీసులు వారందరినీ బలప్రయోగంతో అరెస్టులు చేశారు. ఇతర వామపక్ష నాయకులతోపాటుగా, సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ భార్గవశ్రీ, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కె. శ్రీనివాసరావు, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి కా॥ కె. ఏసులను బలవంతంగా ఈడ్చుకెళ్ళి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ప్రశాంతంగా బందు కార్యక్రమంలో పాల్గొనటానికి జమకూడిన వారిపై పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించటాన్ని వారంతా తీవ్రంగా నిరసించారు. అనంతరం వ్యక్తిగత పూచీపై వారిని విడుదలచేశారు. బందు విజయవంతం చేసిన వ్యాపారులకు, దుకాణదారులకు అభినందనలు తెలిపారు.

**పిడుగురాళ్ళ:**

బందు పిలుపును పురస్కరించుకొని ఇతర వామపక్ష, ప్రతిపక్ష పార్టీలతోకలిసి సిపిఐ(ఎం.ఎల్) బంద్ నిర్వహణలో పాల్గొన్నది. పట్టణంలో సంపూర్ణంగా బందు జరిగింది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), స్త్రీవిముక్తి సంఘటనల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

**కారంపూడి:**

స్థానికంగా సిపిఐ(ఎం.ఎల్) ఇతర వామపక్ష, ప్రతిపక్షపార్టీలతో కలసి బంద్ నిర్వహించింది. రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ జె. పద్మ, ఇంకా మరియదాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని బంద్ నిర్వహణకు కృషిచేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. స్థానిక వ్యాపారులు బందుకు సహకరించారు. రానున్న కాలంలో ప్రజలపై మరింతగా పెరగనున్న భారాలను గుర్తెరిగి, ప్రజలు ఐక్యంగా ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.


రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద
(వ్యాససంకలనం)
సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ
వెల: 12/-
కాపీలకు :
మైత్రీ బుక్ హౌస్
28-9-1,జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

**కణేకల్లు, 18-9-12 :**

అనంతపురం జిల్లా మండల కేంద్రమైన కణేకల్లులో ఎఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సెంటర్‌లో రహదారిపై, డీజిల్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆటోలకు తాళ్ళు కట్టి లాగుతూ ప్రదర్శన నిర్వహించారు. డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఛార్జీలు పెరుగుతున్నాయని, నిత్యావసరాల ధరలూ పెరుగుతున్నాయని, ఇప్పటికే అధిక ధరలతో సతమతమౌతున్న సామాన్య, మధ్యతరగతి జీవితాలను ఈ నిర్ణయాలు మరింత దిగజారుస్తాయని ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ మాట్లాడారు. ధరల పెంపుదలకు వ్యతిరేకంగా నిరంతరాయ సంఘటిత ప్రజా ఉద్యమ నిర్మాణం సాగించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ తిమ్మారెడ్డి; కామ్రేడ్స్ నాగరాజు, దాదాపీర్, రాములు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

**బందరు, 17-9-12 :**

రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించరాదనీ, పెంచిన డీజిల్ ధరలను ఉప సంహరించుకోవాలని, వంటగ్యాస్ సరఫరాపై విధించిన కోతలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ పామర్తి అంజమ్మ మాట్లాడుతూ కిరణా రంగంలోకి ఎఫ్‌డిఐని అనుమతించిన ఫలితంగా ఒక వైపున రైతులు, మరోవైపున వినియోగదారులైన ప్రజలూ-ఇరువురూ తీవ్రంగా నష్టపోతారని; స్వయం ఉపాధిరంగంగా వుండి దాదాపు 8 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న చిల్లరవర్తక రంగం కునారిల్లిపోవటంతో వారంతా ఉపాధి కోల్పోతారనీ, ప్రభుత్వం చెప్తున్న ఉపాధి కల్పన బూటకమనీ పేర్కొంటూ వెంటనే ప్రజావ్యతిరేక ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు, కా॥ ఈపూరి రాంబాబు తదితరులు ఈ ధర్నాలో పాల్గొని నాయకత్వం వహించారు.

**పిడుగురాళ్ళ, 14-9-12:**

డీజిల్ ధరపెంపు, వంటగ్యాస్ సిలిండర్ల కుదింపు చర్యలను నిరసిస్తూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ఒక్కో కుటుంబానికి సబ్సిడీపై సరఫరాచేసే గ్యాస్ సిలిండర్లను ఆరింటికి కుదించివేయటం మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందనీ, దీనితోపాటు డీజిల్ ధర పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు, ప్రయాణ ఛార్జీల ధరలు పెరిగిపోవటంతో సామాన్య , పేద ప్రజానీకపు జీవితాలు మరింత దుర్భరంగా మారుతాయని ఈ పరిస్థితులను మార్చుకొనేందుకు పోరాడాల్సిన అవసరాన్ని గుర్తెరగాలని-ఈ సందర్భంగా మాట్లాడిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥నీలాద్రి రాంబాబు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ఎమ్.నిర్మల-ప్రజలకు పిలుపు నిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో కా॥విశ్వమోహనరెడ్డి కాలనీ వాసులు ఖాసిం, సైదాబి, పరమేశ్వరి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

(తరువాయి 7వ పేజీలో)


గుంటూరులో రాస్తారోకో


విజయనగరంలో రాస్తారోకో


కారంపూడిలో బంద్


బందరులో ధర్నా

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010